

రాజకీయ ప్రచార అస్త్రమే!

డాక్టర్ శ్రీహరిరావు హత్యోదంతంపై వీడని మిస్టరీ



- గత వైసీపీ ప్రభుత్వంలో ఇంట్లో ఉండగానే హత్య
- నిందితులను పట్టుకోవడంలో విఫలమైన పోలీసులు
- 8 నెలల కిందట సీఐడీ విచారణకు ఆదేశించిన కూటమి ప్రభుత్వం
- నేటి వరకు ముందుకు సాగని విచారణ
- గురువారం అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్
- మరోమారు చర్చనీయాంశంగా హత్యోదంతం

అవనిగడ్డ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో కృష్ణాజిల్లాలో సంచలనం రేపిన డాక్టర్ శ్రీహరిరావు హత్యోదంతం రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలకే పరిమితమవుతుంది కానీ దర్యాప్తు ముందుకు సాగటం లేదని నియోజకవర్గ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా అసెంబ్లీలో ఈ కేసు విషయమై స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడటంతో ఈ విషయం మరోమారు చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే... అవనిగడ్డలో ప్రముఖ వైద్యుడిగా పేరున్న డాక్టర్ కోట శ్రీహరిరావు 2020 నవంబరు 27వ తేదీన హత్యకు గురయ్యారు. సీసీ కెమెరాలు దాటుకుని ఇంట్లోకి చొరబడిన దుండగులు హత్య చేసి పరారయ్యారు. అవనిగడ్డ ప్రధాన సెంటర్‌లోని సీసీ కెమెరాల్లో కూడా ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదని పోలీసులు ప్రకటించారు. నాటి వైసీపీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు అత్యంత సన్నిహితులు, మాజీ వ్యాపార భాగస్వామి అయిన డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసు దర్యాప్తు వేగంగా జరిగి, హత్య చేయించిన దుండగులను నాటి ప్రభుత్వం పట్టుకుంటుందని అందరూ భావించినప్పటికీ దర్యాప్తు మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఈ క్రమంలో డాక్టర్ శ్రీహరిరావు హత్యోదంతం వైసీపీ, టీడీపీల మధ్య రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలకే పరిమితమైంది కానీ దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదు. గతేడాది ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చిన జనసేనాని పవన్ కల్యాణ్ ఈ హత్యపై సమగ్రమైన దర్యాప్తు చేయిస్తానని హామీ ఇచ్చారు.

8 నెలల క్రితం సీఐడీ దర్యాప్తునకు ఆదేశించినా..

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టిన వెంటనే డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసును మిగతా 6లో..

జిల్లాలోని పంచాయతీల్లో రోజురోజుకు పనిభారం పెరిగిపోతోంది. మూడు, నాలుగు పంచాయతీలకు ఒక్కరే కార్యదర్శి ఉండటంతో మూడు నెలల క్రితం ప్రారంభమైన ఇంటి పన్నుల వసూలు మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాల్సి ఉన్నా ఇంకా ఓ కొలిక్కి రాలేదు. వివిధ రకాల సర్వేలు, రోజువారీ విధులు, పారిశుధ్య నిర్వహణ వంటి పనులు పర్యవేక్షణ చేసేవారు లేక చతికిల పడుతున్నాయి. గంటల తరబడి జరిగే జూమ్ మీటింగ్‌లు, మండల స్థాయి అధికారులు రెండు రోజులకోసారి నిర్వహించే సమావేశాలతో రోజువారీ పనులు అటకెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో సర్వేలు సక్రమంగా చేయడం లేదని ఎంపీడీవోలు చులకనగా మాట్లాడుతుండటంతో పంచాయతీ కార్యదర్శులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. ఇటీవల కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు.



పనిభారం!

వేధిస్తున్న పంచాయతీ కార్యదర్శుల కొరత

- ఒక వైపు ఇంటి పన్నులు.. మరో వైపు సర్వేలతో సతమతం
- జిల్లాలోని 474 పంచాయతీలకు 163 మందే..
- జూమ్ మీటింగ్‌లు, సమావేశాలతో గడిచిపోతున్న సమయం
- లక్ష్యాలు పూర్తవ్వకపోవడంతో ఎంపీడీవోల నుంచి తిట్లు
- కలెక్టర్ బాలాజీని కలిసి తమగోడు వెళ్లబోసుకున్న కార్యదర్శులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం/గుడివాడ: జిల్లాలో 474 పంచాయతీలు ఉన్నాయి. ఒక్కో పంచాయతీకి ఒకరు చొప్పున 473 మంది ఉండాలి. కానీ 163 మంది కార్యర్శులతో అధికారులు నెట్టుకొస్తున్నారు. మూడు, నాలుగు పంచాయతీలను ఒకే కార్యదర్శి లేదా ఈవో పర్యవేక్షిస్తున్నారు. గతంలో ఇంటి పన్నుల వసూలును పంచాయతీల్లో పనిచేసే బిల్ కలెక్టర్‌లు చేసేవారు. ప్రస్తుతం 474 పంచాయతీలకు 42 మందే బిల్ కలెక్టర్లు పనిచేస్తున్నారు. వీరు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఆ పనిని పంచాయతీ కార్యదర్శులే చేయాల్సి వస్తోంది. దీంతో పాటు ఉదయం ఐదు గంటలకు పంచాయతీలకు వెళ్లి పారిశుధ్య కార్మికులకు పనులు పురమాయించి, వారు సక్రమంగా పనిచేస్తున్నదీ లేనిదీ పర్యవేక్షించాలి. పంచాయతీల్లో తిరుగుతూ ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి వాటి పరిష్కారం కోసం సిబ్బందిని అక్కడికి రప్పించి, పనులు చేయించాల్సినస్థితి. మార్చి నెలాఖరులోగా ఇంటి పన్నులను వసూలు చేయాలనే టార్గెట్ పెట్టారు. ఇంటి పన్నులు వసూలు చేయకుంటే ఉన్నతాధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తోంది. ఏ రోజుకారోజు ఎంతమేర ఇంటి పన్నులు వసూలు చేశారో లెక్కలు పంపాలని, వసూలు చేయకపోవడానికి గల కారణాలను తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి పెడుతున్నారు. ఈ పనులతోపాటు ఇటీవల కాలంలో పి4, వర్క్ ఫ్రమ్ హోం, ఈకేవైసీ, మిస్సింగ్ సిటిజన్స్, హౌస్‌హోల్డ్ జియో కోఆర్డినేట్స్, స్వామిత్ర, స్వర్ణ పంచాయితీలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఒత్తిడి తెస్తున్నారు.

కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలి



జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు వివిధ కారణాలతో పనిఒత్తిడి పెరిగింది. జూమ్ మీటింగ్‌ల పేరుతో రోజులో రెండు, మూడు గంటలపాటు సమయం వృథా అవుతోంది. అదనపు పనిభారంతో సతమతమవుతున్న పంచాయతీ కార్యదర్శులపై సర్వే పనులు పూర్తి చేయడం లేదంటూ ఎంపీడీవోలు విరుచుకుపడుతున్నారు. ఈ పద్ధతిని ఎంపీడీవోలు విడనాడాలి. -భట్రాజు కోటయ్య, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకుడు

సమావేశాలతో సరి..

ఉదయం 10 గంటలు కాగానే డీపీవో లేదా డీఎల్‌పీవోలు జూమ్ మీటింగ్‌లంటూ రెండు గంటల పాటు సమయం తీసుకుంటున్నారు. ఆ తర్వాత మండల స్థాయిలో ఈవోపీఆర్డీలు ప్రత్యేక సమావేశాలంటూ పంచాయతీ కార్యదర్శులను పిలిపించి రెండు, మూడు గంటలపాటు సమయం తీసుకుంటున్నారు. ఈలోగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోలతో సమావేశం ఉందంటూ పిలుస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలకు సంబంధించి ఎంతమేర పూర్తిచేశారో వివరాలను తెలియజేయాలని ఎంపీడీవోలు కోరుతున్నారు. సర్వేలు సకాలంలో చేయని పంచాయతీ కార్యదర్శులను అందరిముందు చులకనగా మాట్లాడుతూ మిగతా 6లో

మెట్రోకు మొదటి అడుగు

- సీఎంపీ సర్వేకు ఏపీఎంఆర్‌సీ అధికారులు ఓకే
- శిస్త్రా సంస్థకు ఎల్‌వోఏ విడుదల
- సీఎంపీ సర్వే ప్రారంభం.. మూడు నెలల్లో పూర్తి
- కేంద్రం వద్దకు సర్వే రిపోర్టు
- అనంతరం పనులు ప్రారంభమయ్యే అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుకు సంబంధించి కీలక అడుగు ముందుకు పడింది. కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) కన్సల్టెన్సీ సంస్థ శిస్త్రాకు ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) అధికారులు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ (ఎల్‌వోఏ) ఇచ్చారు. శిస్త్రా సంస్థ.. ఏపీఎంఆర్‌సీ అధికారులతో భేటీ కావటంతో పాటు క్షేత్రస్థాయిలో సర్వే కూడా ప్రారంభించింది.

నూరుశాతం నిధులు కేంద్రమే భరించేనా?

విజయవాడ మెట్రో ప్రాజెక్టును నూరుశాతం ఖర్చు భరించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ఏపీఎంఆర్‌సీ రాసిన లేఖ మేరకు తాజా సీఎంపీ తయారు చేయాల్సిందిగా కేంద్రం నిర్దేశించింది. సీఎంపీ రూపకల్పనకు ఏపీఎంఆర్‌సీ అంగీకారం తెలపటంతో.. కన్సల్టెంట్ ఎంపికను వేగంగా చేపట్టింది. ఇంతకుముందు విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టు డీపీఆర్ తయారుచేసిన శిస్త్రా సంస్థే ఈ సీఎంపీ బాధ్యతలను కూడా దక్కించుకుంది. కన్సల్టెన్సీ సంస్థతో మాట్లాడి అగ్రిమెంట్ ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. ఈనెల 17న కేంద్ర ప్రభుత్వం సీఎంపీ రూపొందించటానికి అనుమతులు ఇచ్చింది. 18న ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు శిస్త్రాకు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ (ఎల్‌వోఏ) ఇచ్చారు. అనంతరం శిస్త్రా సంస్థ ప్రతినిధులతో భేటీ అయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ప్రయాణికుల రాకపోకల సర్వేను చేపట్టడానికి ఎలాంటి పద్ధతులు అవలంబించాలో నిర్దేశించింది. దీంతో శిస్త్రా ప్రతినిధులు ఇప్పటికే సర్వే చేపట్టడానికి రంగంలోకి దిగారు. మూడు నెలల్లో దీనిని పూర్తి చేయాల్సి ఉంది. ఆ తర్వాత ఏపీఎంఆర్‌సీ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆమోదింపజేస్తారు. ఆ వెంటనే కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు. ఈ సీఎంపీ ఆధారంగా విజయవాడ మెట్రోకు ఉన్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం తెలుసుకోగలుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఎంఆర్‌సీ అధికారులు కోరినట్టుగా నిధులు ఎంత మేరకు విడుదల చేయాలో నిర్ణయించుకుంటుంది. కోలకతాలో మాదిరిగా కేంద్రమే పూర్తి నిధులతో మెట్రో ప్రాజెక్టును చేపట్టే అవకాశం ఉంటుంది. సీఎంపీ పూర్తయ్యే వరకు విజయవాడ మెట్రోకు నిధుల అంశం కొలిక్కి వచ్చే పరిస్థితి లేదు. విజయవాడ మెట్రోరైల్ మొదటి కారిడార్.. కృష్ణా జిల్లా గన్నవరం నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా ఎన్టీఆర్ జిల్లా రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, బస్టాండ్ వరకు ఉంది. రెండో కారిడార్.. కృష్ణాజిల్లాలోని పెనమలూరు సెంటర్ నుంచి ఎన్టీఆర్ జిల్లాలో బందరు రోడ్డు మీదుగా బస్టాండ్ వరకు సాగుతుంది. ఈ రెండు కారిడార్లకు రూ.11,009 కోట్ల వ్యయమవుతుంది.



ఇద్దరు నిందితుల అరెస్టు

- మరో ఐదుగురి కోసం గాలింపు
- బాలికపై సామూహిక అత్యాచారం కేసులో చర్యలు తీసుకున్న పోలీసులు
- మూడు రోజుల పాటు బాలికపై అత్యాచారానికి పాల్పడినట్టు నిర్ధారణ
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ గంగాధరరావు



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

గన్నవరం/మచిలీపట్నం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బాలికపై సామూహిక అత్యాచారం కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మరో ఐదుగురు నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఈ కేసు వివరాలను గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆర్.గంగాధరరావు గురువారం మీడియాకు వెల్లడించారు. ఆయన మాటల్లో... గన్నవరం మండలం వీరపనేనిగూడేనికి చెందిన యువతికి జి.కొండూరుకు చెందిన వ్యక్తితో వివాహం జరిపించారు. అక్కడ వారి ఇంటి పక్కన ఉండే బాలిక వీరి పిల్లలతో చనువుగా ఉండేది. చదువు మానేసి ఇంటి దగ్గరే ఉంటుంది. ఈ నేపథ్యంలో వీరపనేనిగూడెంలో అంజమ్మ, సుబ్బమ్మ, పేరంటాలమ్మ తిరునాళ జరిగింది. దీనికి ఆ మహిళ పిల్లలతో కలసి స్వగ్రామానికి వస్తుండగా నేను వస్తానని సదరు బాలిక అనడంతో బాలిక తండ్రి వద్దని చెప్పారు. వెళతానని మొండికేయడంతో రూ.200 ఇచ్చి ఆ మహిళతో పాటు పంపించారు. ఈ నెల 9వ తేదీన వీరపనేనిగూడెం వచ్చారు. నాలుగు రోజుల తరువాత ఆ మహిళ ఇంట్లో గొడవ జరిగింది. ఈ గొడవకు కారణం నువ్వేనని, మీ నాన్నతో చెబుతానని బాలికను మహిళ తల్లి మందలించింది. నాన్నతో చెబితే కొడతాడని భయపడిన బాలిక ఇంట్లో నుంచి ఈ నెల 13వ తేదీ రాత్రి 10.30 గంటలకు బయటకు వచ్చింది. సగర్లపేటలోని నాలుగు రోడ్ల సెంటర్‌కు రాగానే పక్కనే ఉన్న వెంచర్‌లో కొందరు యువకులు మద్యం తాగుతున్నారు. వారి వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పింది. ఆ యువకులు ఆ బాలికను ద్విచక్ర వాహనంపై తీసుకుని కేసరపల్లిలో వారి స్నేహితుడి సహాయంతో ఒక ఇంట్లో పెట్టారు. ఒకరి తర్వాత మరొకరు చొప్పున ఏడుగురు ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. సదరు మహిళకు రెండు రోజుల తర్వాత అనుమానం వచ్చి బాలిక ఇంటికి వెళ్లిందా లేదా అని ఆరా తీసింది. జి.కొండూరు రాలేదని తెలియడంతో ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎనిమిది బృందాలతో గాలింపు చేపట్టారు. ఆపరేషన్ పేరిట వాట్సాప్ గ్రూపును క్రియేట్ చేసి లుక్ అవుట్ నోటీసులను రాష్ట్రవ్యాప్తంగా పంపించారు. బాలిక కలర్ ఫొటోను అన్ని పోలీస్ స్టేషన్‌లకు పంపించారు. సాంకేతిక మిగతా 6లో..



విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ప్రజాప్రతినిధుల క్రీడా పోటీల్లో షాట్‌పుట్ బాల్ విసురుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము - ఆంధ్రజ్యోతి, గుడివాడ



విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ప్రజాప్రతినిధుల క్రీడా పోటీల్లో టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ చూపి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా బహుమతి అందుకుంటున్న పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా - ఆంధ్రజ్యోతి, పామర్రు

ప్రాధాన్యతాంశాలపై నివేదిక ఇవ్వండి

- అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం

6లో





8లో

ప్రకృతి ఒడిలో.. కొంత కాలం

కంచలలో 'తత్వవనం' పేరుతో తొలి పీపీపీ ఎకో టూరిజం ప్రాజెక్టు

దుర్గగుడి చైర్మన్ నియామకంపై ఐవీఆర్ఎస్ సర్వే

కసరత్తు ప్రారంభించిన కూటమి ప్రభుత్వం

- పదవి కోసం పట్టుబడుతున్న కూటమి పార్టీల నేతలు
- ప్రచారంలో నెట్టెం, గూడపాటి, వెలగపూడి, బుద్దా, సారిపల్లి పేర్లు
- బీజేపీ నుంచి అడ్డూరి శ్రీరామ్, జనసేన నుంచి ఓ మహిళా నాయకురాలి పేరు కూడా..

ఇంద్రకీలాద్రి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి పాలకవర్గం నియామకానికి కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఛైర్మన్‌గా ఎవరికి అవకాశం ఇవ్వాలి అనే అంశంపై ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కాగా, గత రెండు నెలలు నుంచి ప్రభుత్వ పెద్దలు వివిధ ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో కొన్నింటికి నియామకాలు చేశారు. మరికొన్ని పదవులపై కసరత్తు చేస్తున్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోనే అతిపెద్ద రెండవ దేవస్థానం అయిన శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానం ఛైర్మన్ పదవిపై టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల్లోని పలువురు నాయకులు మిగతా 6లో..

బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారు

» ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



ఇబ్రహీంపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బీసీలను మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఓటు బ్యాంకుగా వాడుకున్నాడని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో గురువారం ఆయన మాట్లాడుతూ, టీడీపీ హయాంలో బీసీల కోసం 65 పాఠశాలలు మంజూరు చేస్తే అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులకు నిధులు ఇవ్వలేదన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో బీసీ బాలికలకు ప్రత్యేకంగా వసతి భవనం లేనందున కొండపల్లిలోని పాత పోలీస్‌స్టేషన్ స్థలాన్ని బీసీ హాస్టల్‌కు ఇవ్వాలని కోరారు. బాలికలకు ప్రత్యేక గురుకుల పాఠశాల కేటాయించాలన్నారు.



ఎంపీ శివనాథ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న తానా ప్రతినిధులు

ఎంపీ కేశినేని శివనాథ్‌కు తానా ఆహ్వానం

వన్‌టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) రెండేళ్లకోసారి నిర్వహించే మహాసభలకు రావాల్సిందిగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ను తానా సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. సంఘ ప్రతినిధులు ఢిల్లీలో గురువారం ఎంపీని కలిసి జులై 3 నుంచి 5 వరకు అమెరికాలోని డెట్రాయిట్‌లో జరగనున్న తానా మహాసభలకు రావాల్సిందిగా ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తానా చైర్మన్ గంగాధర్ నాదెళ్ల, కాన్ఫరెన్స్ డైరక్టర్ సునీల్ పాంత్రా, మాజీ అధ్యక్షుడు జయరాం కోమటి తదితరులు ఉన్నారు.



కాలువ వద్ద నీటిని పరిశీలిస్తున్న ఎన్ఎస్పీ అధికారులు, రైతులు

కాల్వలకు సాగర్ జలాలు విడుదల

వావిలాల(తిరువూరు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల ఎన్ఎస్పీ మేజర్ కాలువకు, 35 క్యూసెక్కుల సాగర్ జలాలను బుధవారం సాయంత్రం విడుదల చేశారు. గురువారం కాలువలో నీటిని స్థానిక ఎన్ఎస్పీ అధికారులు పరిశీలించారు. మధిర బ్రాంచి కెనాల్‌పై ఖమ్మంజిల్లా ఎర్రబోయినపల్లి లాకుల నుంచి నీటిని విడుదల చేయడంతో ముష్టికుంట్ల మేజర్ ఆయకట్టు పరిధిలోని, వెంకటేశ్వరనగరం, వావిలాల, ముష్టికుంట్ల, రాజుగూడెం, వామకుంట్ల తదితర గ్రామాల్లోని సుమారు ఆరువేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఎర్రబోయినపల్లి వాద్ద లాకుల నుంచి ముష్టికుంట్ల మేజర్‌కు 55 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 35 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేశారని అధికారులు పేర్కొంటున్నారు. తిరువూరు, గంపలగూడెం ఎన్ఎస్పీ ఏఈలు సునీత, మహేష్, డీసీ చైర్మన్ గంధ్ర ప్రసాదు, ఆయకట్టు రైతులు పరిశీలించారు.

జర్మనీలో ఉద్యోగాల కోసం
నిరుద్యోగ యువతకు ప్రాజెక్ట్ సర్వసేతు శిక్షణ

వన్‌టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జర్మనీలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాన్ని అందించడంలో 'ప్రాజెక్టు సర్వసేతు' ద్వారా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈవో జి.గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో జర్మనీలోని ప్రవాస భారతీయుల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. దీని ద్వారా ఏపీలో ఫైనల్ ఐటీఐ విద్యార్థులకు జర్మనీ భాష, సంస్కృతి, నైపుణ్యం సాధించేందుకు శిక్షణ ఇవ్వనున్నారు. మ్యూనిక్‌లోని భారతీయ రాయబార కార్యాలయ సహకారంతో జర్మనీలోని ప్రవాస భారతీయసంఘం ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. శిక్షణ రెండు భాగాలుగా ఉంటుంది. ఒక్కో బ్యాచ్‌లో 150 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు. ఏ1, ఏ2 స్థాయిలో జర్మనీ భాషా సర్టిఫికేషన్ విజయవంతంగా పూర్తిచేసి ఫైనల్ ఇయర్ ఐటీఐ విద్యార్థులు జర్మనీలో ఉద్యోగ అవకాశం కోసం అర్హత పొందుతారు. మే మొదటివారం నుంచి శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నాయి. 'ప్రాజెక్టు సర్వసేతు'తో భాగస్వామ్యం అంతర్జాతీయస్థాయిలో భారతీయ యువతకు నైపుణ్యాభివృద్ధిని కలిగించటమే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ అవకాశాలను అన్వేషించేందుకు మరింతగా దోహదపడుతుందని, యువతకు అవకాశాలను అందించేందుకు 'ప్రాజెక్టు సర్వసేతు' మరో ముందడుగుగా భావించవచ్చునని నిర్వాహకులు తెలిపారు.

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బెంజిసర్కిల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఏపీలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో(ఏపీకేజీబీవీ) ప్రవేశాలకు ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. రాష్ట్రంలోని 352 కేజీబీవీల్లో 2025-26 విద్యాసంవత్సరానికి గాను 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు, అదే విధంగా 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, బడి మానేసినవారు పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ పరిధిలోని బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోని తీసుకుంటామని తెలిపారు. దరఖస్తులు https://apkgbv.apcfss.in ద్వారా పొందవచ్చని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ఫోన్ మెసేజ్ వస్తుందని, పూర్తి వివరాలకు, 7075159996, 7075039990 నెంబర్లను సంప్రదించాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

తిరువూరులో పొలిటికల్ హీట్!

» ఉత్కంఠ రేపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పు
» తాడేపల్లికి అవిశ్వాస తీర్మానం అంశం..
» ఆచితూచి అడుగులు వేసే దిశగా వైసీపీ నేతలు

తిరువూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తిరువూరు మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం అంశం సద్దుమణిగినా.. చైర్‌పర్సన్ మార్పు సామరస్యంగా జరుగుతుందా అన్న అనుమానం కలుగుతోంది. మున్సిపాలిటీలో ఒప్పందం అంశాన్ని తాడేపల్లిలో పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి దృష్టికి స్థానిక కౌన్సిలర్లు, పార్టీశ్రేణులు తీసుకువెళ్లగా.. విషయంపై జగన్ ఆచితూచి అడుగువేయాలని చెప్పినట్టు పలువురు నేతలు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చైర్మన్‌ను మార్చడం పార్టీకి నష్టంతో పాటు మున్సిపాలిటీ చేజారిపోతుందని సీనియర్ నేత ఒకరు పేర్కొన్నట్టు కౌన్సిలర్లు చెబుతున్నారు. కాగా అధిష్టానం ఆదేశాలకు కట్టుబడి ఉంటామని, ప్రస్తుత చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి జగన్ వద్ద చెప్పినట్టు సమాచారం. ఆమె రాజీనామా పత్రాన్ని పట్టణ నేత వద్ద ఉంచినట్టు సమాచారం. కొందరు కౌన్సిలర్లు పక్కచూపులు చూస్తున్నట్టు పట్టణంలో ప్రచారం జరగడంతో చైర్మన్ ఎంపిక అంశం మరింత గందరగోళంగా మారే అవకాశం ఉందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ బోర్డు వైసీపీ చేతుల్లో ఉంటుందా.. లేక రంగుమారుతుందా అనే చర్చ పట్టణ ప్రజల్లో సాగుతోంది.



మూన్నాళ్ల ముచ్చటే!

డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా మార్టు రెండేళ్లకే చతికిలపడింది. లాభాల సంగతి దేవుడెరుగు.. ఒకవైపు మార్టులో ఆశించినంతగా సరుకుల విక్రయాల్లేక, మరోవైపు నిర్వహణ ఖర్చులు పెనుభారంగా మారటంతో నష్టాలను మూటగట్టుకుంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవటం వల్ల ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో మార్టు మనుగడ ప్రశ్నార్థకం కావటంతో అంతర్గతంగా విచారణ జరుపుతున్న వెలుగు అధికారులకు ఏమి చేయాలో పాలుపోవటం లేదు.

(ఆంధ్రజ్యోతి-కంచికచర్ల)

» తిరోగమనం దిశగా మహిళా మార్టు!
» ఆదరణ లేక నష్టాల బాట..
» నిర్వహణ భారం.. అవినీతి మరకలు
» సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం
» మార్టు నిర్వహణపై అధికారుల విచారణ

మండలంలో మొత్తం 1834 డ్వాక్రా సంఘాలున్నాయి. నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు అందించాలన్న ఉద్దేశ్యంతో మహిళా మార్టు ఏర్పాటు కోసం ఒక్కొక్క డ్వాక్రా మహిళ రూ. 200 చెల్లించి సభ్యత్వం తీసుకున్నారు. పదిమంది సభ్యుల సంఘం రూ.2వేలు చెల్లించింది. మొత్తం 16 వందల సంఘాలు సొమ్ములు చెల్లించగా, రూ.29 లక్షలకు పైగా మార్టు కోసం పెట్టుబడి నిధి సమకూరింది. మార్టు నిర్వహణ కోసం ప్రత్యేకంగా డ్వాక్రా మహిళల నుంచి ఒక కమిటీని ఎన్నుకున్నారు. రెండేళ్ల క్రితం 2023 మార్చి నెలలో స్థానిక చెవిటికల్లు రోడ్ సెంటర్‌లో అద్దె భవనంలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టును అప్పటి వైసీపీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు ప్రారంభించారు. మొదట్లో వైసీపీ నేతలు, వెలుగు అధికారులు ఆర్భాటంగా ప్రచారం చేసిన స్థాయిలో మార్టు టర్నోవర్ సాధించలేక పోయింది.

మహిళల నుంచి కొరవడిన ఆదరణ

సాధారణంగా బయటి మార్కెట్ కంటే మార్టులో ఒక రూపాయి తక్కువ ధరకు సరుకులు విక్రయించాలి. మార్టులో సభ్యులైన డ్వాక్రా మహిళలు తమ కుటుంబ అవసరాల నిమిత్తం సరుకులను తప్పనిసరిగా మార్టులో కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే డ్వాక్రా మహిళల నుంచి ఆదరణ కరువైంది. బయట దుకాణాల్లో వారు సరుకులు కొనుగోలు చేస్తుండటం, ముఖ్యంగా ఇతర గ్రామాల నుంచి మహిళలు మార్టుకు రాకపోవటం, దీనికితోడు బయటి వ్యక్తులు కూడా కన్నెత్తి చూడకపోవటం వల్ల మార్టులో ఆశించన మేర అమ్మకాలు జరగలేదు. నెలకు రూ. 50వేల నుంచి రూ. 60వేలు అమ్మకం జరగటమే గొప్ప.

భారంగా నిర్వహణ ఖర్చులు

క్రయ విక్రయాల టర్నోవర్ లేకపోవటంతో నిర్వహణ ఖర్చులు భారంగా మారాయి. ప్రారంభంలో డేటా ఎంట్రీ ఆపరేటర్, మరో ముగ్గురు వర్కర్లు ఉన్నారు. భవనానికి అద్దె నెలకు రూ. 24 వేలు. విద్యుత్ బిల్లు రూ. నాలుగైదు వేలు వచ్చేది. ఒక్కొక్కరికి రూ. ఎనిమిది వేల వంతున నలుగురికి జీతభత్యాలు రూ. 32 వేలు. ఇతరత్రా ఖర్చులు కాకుండా ప్రధాన ఖర్చులు నెలకు రూ. 60 వేలు మించి అయ్యేవి. లాభాలు లేకపోగా ప్రతి నెల నష్టాలను మూటగట్టుకోవాల్సి వచ్చింది. ఖర్చును తగ్గించేందుకు కొద్దినెలల క్రితం ఇద్దరు వర్కర్లను తొలగించారు. మరో అద్దె భవనంలోకి మార్చేందుకు ప్రయత్నించారు. ఆ యజమాని కూడా అద్దె నెలకు రూ. 24 వేలు చెప్పటంతో తరలింపు ప్రతిపాదన విరమించారు. ఈ నేపథ్యంలో సరుకులు కొనటానికి సొమ్ములు కూడా లేకపోవడంతో అద్దె భవనం నుంచి మిగిలిన సరుకులను, ఫర్నీచర్‌ను మూడు రోజుల క్రితం వెలుగు కార్యాలయానికి తరలించారు.

అధికారుల పర్యవేక్షణ లోపం..

సరైన నిర్వహణ లేకపోవటం, అధికారుల పర్యవేక్షణ లోపించం వల్ల మహిళా మార్టు పూర్తిగా చతికిలపడటమే కాకుండా, ఆర్థికంగా అవకతవకలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్టు ప్రారంభంలో ఏసీలు, కంప్యూటర్లు, ఇతర ఫర్నీచర్ కోసం రూ.పది లక్షలు ఖర్చుచేశారని చెబుతున్నారు. ఈ విషయంలో పారదర్శకత పూర్తిగా లోపించింది. ప్రస్తుతం మిగిలిన సరుకులు కూడా పెద్దగా లేవని అంటున్నారు. ఏదేమైనా మార్టు గురించి సోషల్ మీడియాలో పెద్దఎత్తున వ్యతిరేక ప్రచారం జరుగుతుండటంతో వెలుగు అధికారులు దృష్టి సారించారు.

అధికారుల విచారణ

మార్టులో ఏం జరిగిందన్న విషయమై ఇటీవల మార్టు నిర్వహణ కమిటీ సభ్యులను అధికారులు విచారిస్తున్నారు. ఈ అంశంపై స్థానిక వెలుగు ఏపీఎంను వివరణ కోరగా, సరుకులు అమ్ముడు కానందున నష్టాలు వచ్చాయని, నిర్వహణ భారంగా పరిణమించటంతో మార్టును వెలుగు కార్యాలయానికి తరలించినట్టు చెప్పారు. ఆర్థికపరమైన అవకతవకలు లేవని, ఫర్నీచర్ విలువ రూ.10లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. మిగులు సరుకు రూ. 3లక్షల వరకు ఉంటుందని చెప్పగా, మిగతా సొమ్ము గురించి ప్రస్తావించగా, ఆయన సమాధానం దాటవేశారు.

ప్రాధాన్యతాంశాలపై నివేదిక ఇవ్వండి

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 25, 26 తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు జిల్లాలోని ప్రాధాన్యతా అంశాలపై పూర్తిస్థాయి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం పలు శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు సాధించిన ప్రగతి, సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై శాఖల వారీగా నివేదికలను తయారు చేయాలన్నారు. రానున్న మూడునెలల్లో మునిసిపల్, డ్వామా, గ్రామీణ నీటిసరఫరా, వ్యవసాయ అనుబంధ శాఖలు, గృహనిర్మాణం, వైద్యం వివిధశాఖల్లో నిర్వహించాల్సిన కార్యాచరణ ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. సమావేశంలో జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో కె.చంద్రశేఖర రావు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

కర్మయోగి భారత్ శిక్షణ పూర్తిచేయాలి

జిల్లాలోని ఉద్యోగులంతా ఈనెల 26లోగా కర్మయోగి భారత్ ఆన్‌లైన్ శిక్షణ పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, సీఎఫ్ఎంఎస్ గుర్తింపు నెంబరు కలిగిన ఉద్యోగులు ఆన్‌లైన్‌లో శిక్షణ పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం అడిగిన ప్రశ్నలకు వారు సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. హార్ట్ ఇన్ గవర్నెన్స్, కోడ్ ఆఫ్ కాంటాక్ట్ ఫర్ గవర్నమెంట్ ఎంప్లాయిస్, ఓరియంటేషన్ మాడ్యూల్ ఆన్ మిషన్ లైఫ్ కోర్సులకు సంబంధించిన మూడు వీడియోలు ఉంటాయని తెలిపారు. ఉద్యోగులు 'ఐ గాట్ కర్మయోగి భారత్' యాప్‌ను తమ సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సీఎంఎఫ్ఎస్ ఐడీతో అనుసంధానం చేసుకుని శిక్షణలో పాల్గొనాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖర రావు, రాష్ట్ర ప్లానింగ్ సొసైటీ సీనియర్ సలహాదారు వెంకటేశ్వరస్వామి పాల్గొన్నారు.

జిల్లా ప్రత్యేక అధికారి రాక

మచిలీపట్నం : జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ నిమిత్తం జిల్లాకు వచ్చిన ప్రత్యేక అధికారి మనజీర్ జిలానీసమూన్‌కు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ స్వాగతం పలికారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు, అర్జీల పరిష్కారం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, పీ-4సర్వే, ఉచిత ఇసుకవిధానం అమలు, ధాన్యం కొనుగోలు, ఉపాధిహామీ పథకం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనపథకం, పదోతరగతి పరీక్షల నిర్వహణ వివరాలను ప్రత్యేక అధికారికి కలెక్టర్, జేసీ వివరించారు. పోర్టు, ఫిషింగ్ యార్డ్‌ల నిర్మాణం, సూర్యఘర్, భూముల రీసర్వే, తదితర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును అడిగి తెలుసుకున్నారు.



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ సుధాకర్, ఇన్‌సెట్లో కోటేశ్వరమ్మ (ఫైల్)

మోపెడ్‌ను ఢీకొన్న టిప్పర్

» భార్య మృతి, భర్తకు గాయాలు

మైలవరంరూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : టీవీఎస్ మోపెడ్‌పై వెళుతున్న భార్యాభర్తలను టిప్పర్ లారీ ఢీకొనడంతో భార్య మృతిచెందగా, భర్తకు గాయాలైన ఘటన గురువారం మైలవరంలో జరిగింది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జి.కొండూరుకు చెందిన వాకా వెంకటేశ్వరరావు, కోటేశ్వరమ్మలు భార్యాభర్తలు. గురువారం ఉదయం ఆగిరిపల్లి సమీపంలోని మామిడి తోటకు వెళ్లి పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా గణపవరం ఊరుబయట ఇబ్రహీంపట్నం నుంచి బూడిద లోడుతో వెళుతున్న టిప్పర్ మూల మలుపు వద్ద మోపెడ్‌ను వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో వెనుక కూర్చున్న కోటేశ్వరమ్మ తలకు రోడ్డు దెబ్బతగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గాయాలైన వెంకటేశ్వరరావును హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోటేశ్వరమ్మ(55) మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మైలవరం ఎస్ఐ కె.సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మే 15 నుంచి మంగినపూడిలో జాతీయ బీచ్ కబడ్డీ పోటీలు

» అనుమతి కోసం ఏకేఎఫ్ఐకి లేఖ

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 20(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌లో 12వ జాతీయ సీనియర్ మహిళల, పురుషుల బీచ్ కబడ్డీ పోటీలను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని కబడ్డీ రాష్ట్ర సంఘం కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు. మే 15 నుంచి 18వరకు జరగనున్న పోటీల అనుమతి కోసం ఏపీ కబడ్డీ అసోసియేషన్‌కు మంత్రి రవీంద్ర గురువారం లేఖ రాసినట్టు తెలిపారు. అమేచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏకేఎఫ్ఐ) నుంచి జాతీయ బీచ్ కబడ్డీ పోటీలకు అనుమతులు తెచ్చి ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని లేఖలో పేర్కొన్నట్టు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో పోటీలకు అనుమతులు వస్తాయని తెలిపారు. పోటీల నిర్వహణకు తమ నుంచి సహకారం అందిస్తామని శ్రీకాంత్ తెలిపారు.



పెన్షనర్ల సమస్యలపై మాట్లాడుతున్న వరప్రసాద్

రివైజ్డ్ పెన్షన్ కోసం ఉద్యమిద్దాం

» బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల సంఘ నేత వరప్రసాద్

మచిలీపట్నం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : దేశంలో విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు రివైజ్డ్ పెన్షన్ కోసం జాతీయ స్థాయిలో ఉద్యమిస్తామని అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి వి.వరప్రసాద్ అన్నారు. గురువారం మచిలీపట్నం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో వరప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా నాలుగు లక్షల మంది రిటైర్డ్ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతున్నామన్నారు. త్వరలో ఎర్నాకులంలో రిటైర్డ్ ఉద్యోగుల జాతీయ సభలు జరుగుతాయన్నారు. ఏప్రిల్ 4న విజయవాడలో జరగనున్న ప్రాంతీయ సమావేశానికి జిల్లాలోని రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. మచిలీపట్నం సంఘ అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన సభలో ఆర్.శ్రీనివాస్, సంఘ నాయకులు మాట్లాడారు. కాగా మచిలీపట్నం కార్యవర్గ అధ్యక్షుడిగా వై.నాగేశ్వరరావు తిరిగి ఎన్నికయ్యారు.

నందిగామ ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్

నందిగామ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నందిగామ ఎంపీపీ స్థానాలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలకుగాను 13 స్థానాలను వైసీపీ అభ్యర్థులు కైవసం చేసుకోగా రామిరెడ్డిపల్లి ఎంపీటీసీ స్థానాన్ని టీడీపీ గెలుచుకుంది. ఎంపీపీ ఎస్సీ మహిళకు కేటాయించగా గతంలో ఎంపీపీగా పనిచేసిన కేతవీరునిపాడు ఎంపీటీసీ సభ్యురాలు అరిగెల సుందరమ్మ గతేడాది ఎన్నికలకు ముందు పదవికి రాజీనామా చేశారు. అనంతరం జరిగిన పరిణామాల దృష్ట్యా ఎంపీపీ ఎన్నిక నిలిచిపోవటంతో అడవిరావులపాడు ఎంపీటీసీ సభ్యుడు ఆకుల హనుమంతరావు ఇన్‌చార్జ్ ఎంపీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఐతవరం ఎంపీటీసీ సభ్యుడు టీడీపీలో చేరినప్పటికీ వైసీపీకి పూర్తి మెజార్టీ ఉంది. గత ఎన్నికల సమయంలో అప్పటి ఎమ్మెల్యే జగన్మోహనరావు బ్రదర్స్ హామీ మేరకు రాఘవాపురం ఎంపీటీసీ సభ్యురాలు పెసరమల్లి రమాదేవిని ఎంపీపీ వరిస్తుందో లేదో వేచి చూడాల్సి ఉంది. కాగా మండలంలో ఎంపీటీసీలుగా ఎన్నికైన వారిలో మహిళలు ముగ్గురు మాత్రమే ఉన్నారు. వీరిలో ఒకరు ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించి రాజీనామా చేయగా మరొకరు రమాదేవి కాగా ఇంకొకరు రుద్రవరం ఎంపీటీసీగా ఎన్నికైన జిల్లేపల్లి కమల ఉన్నారు. వీరిద్దరిలో పదవి ఎవరిని వరిస్తుందో చూడాల్సిందే.



పెసరమల్లి రమాదేవి



జిల్లేపల్లి కమల

దుర్గగుడి చైర్మన్ నియామకంపై ఐవీఆర్ఎస్ సర్వే

(5వ పేజీ తరువాయి)

ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ పదవి బీజేపీకి ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు గట్టిగా ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. మరో పక్క టీడీపీ, జనసేన పార్టీల్లోని పలువురు నాయకులు తమకే చైర్మన్ పదవి కావాలని ఆయా పార్టీల అధినేతలపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది.

పదవి కోసం పలువురి నేతల పట్టు

దుర్గగుడి చైర్మన్ పదవి మరికొన్ని రోజుల్లో భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్, గూడపాటి పద్మశేఖర్, వెలగపూడి శంకర్‌బాబు, బీసీ సామాజిక వర్గం నుంచి సీనియర్ నాయకులు బుద్దా వెంకన్న, సారిపల్లి రాధాకృష్ణ, బీజేపీ నుంచి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన పార్టీ నుంచి ఓ మహిళా నాయకురాలు కూడా దుర్గగుడి చైర్మన్ పదవికి గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దుర్గగుడి చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.



కలెక్టర్ బాలాజీని కలిసిన పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

పని భారం!

(5వ పేజీ తరువాయి)

చీవాట్లు పెడుతున్నారు. చల్లపల్లి మండలంలో పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోతో సమావేశం అంటేనే వణికిపోతున్నారు. ఈ మండలం ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులపై తనదైన శైలిలో విరుచుకుపడుతుండటంతో పంచాయతీ కార్యదర్శులు బెంబేలెత్తిపోతున్నారు. అధికశాతం మండలాల్లో పంచాయతీ కార్యదర్శులపై ఎంపీడీవోల తీరు ఇలానే ఉందని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు.

కలెక్టర్‌ను కలసి వినతి

పంచాయతీల్లో సిబ్బంది కొరతతో పాటు, మూడు, నాలుగు పంచాయతీలను ఒక్కో పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షిస్తుండటంతో తమపై పనిభారం పెరిగిందని, పంచాయతీ కార్యదర్శులంతా ఇటీవల పంచాయితీరాజ్ ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి తమపై పనిభారం తగ్గించాలని, జూమ్ మీటింగ్‌లు, ఇతరత్రా సమావేశాలు కొంతమేర తగ్గిస్తే పంచాయతీలకు సంబంధించిన పనులు పూర్తిచేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సచివాలయాల్లో గ్రేడ్-5 సెక్రటరీలను పంచాయతీల్లో పనిచేసేందుకు తమకు సహాయకులుగా ఇవ్వాలని కోరుతూ అర్జీ అందజేశారు. అధికారులు నిర్వహించే సమావేశాలతోనే రోజులో సగం సమయం సరిపోతోందని తెలిపారు. బిల్ కలెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లు కూడా పంచాయతీల్లో లేకపోవడంతో పరిపాలనా పరమైన అంశాల్లో ఇబ్బందులు పడుతున్నామని వారు కలెక్టర్‌కు వివరించారు.

ఇద్దరు నిందితుల అరెస్టు

(5వ పేజీ తరువాయి)

పరిజ్ఞానం, డ్రోన్‌లను ఉపయోగించి ఆత్కూరు, వీరపనేని గూడెం ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. కలెక్టర్ దృష్టిలో పెట్టి జిల్లాలోని అన్ని సచివాలయాల గ్రూపుల్లో, ఆశా వర్కర్లు, డ్వాక్రా గ్రూపుల్లో బాలిక ఫొటోను వైరల్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీ రాత్రి బాలికను ఆటో డ్రైవర్ మాచవరం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ, బాలిక తల్లిదండ్రులు అక్కడికి వెళ్లి బాలికను పెద్ద ఆవుటపల్లిలోని బంధువుల ఇంటికి తీసుకువెళ్లారు. బాలికకు కడుపులో నొప్పి వస్తున్నట్లు తల్లికి చెప్పగా, ఆమె ఆత్కూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే విజయవాడ ప్రభుత్వాస్పత్రికి పంపించారు. మహిళా ఎస్సై సమక్షంలో బాలిక తనపై కొంతమంది అత్యాచారం చేసినట్లు చెప్పగా స్టేట్మెంట్ రికార్డు చేశారు. ఆ రాత్రి బాలికను కేసరపల్లి తీసుకెళ్లి మూడు రోజుల పాటు ఉంచారు. ఆరుగురు యువకులు, ఒకరు మైనర్ బాలుడు బాలికపై అత్యాచారం చేశారు. మూడు రోజుల అనంతరం బాలికను విజయవాడలో దింపారు. అక్కడ బాలిక ఆటో ఆపి విజయవాడ వెళ్లాలి అని చెప్పటంతో డ్రైవర్‌కు అనుమానం వచ్చి పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో నిందితులు బాణావతు లక్ష్మణ జితేంద్ర, పగడాల హర్షవర్ధన్‌ను అరెస్టు చేశారు. మరో ఐదుగురి కోసం గాలిస్తున్నారు. మీడియా సమావేశంలో డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, ఎస్సై శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రచార అస్త్రమే!

(5వ పేజీ తరువాయి)

సీబీసీఐడీకి అప్పగిస్తూ గత ఏడాది జూలై 30వ తేదీన ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దాదాపు ఐదేళ్లపాటు మరుగున పడిన ఈ కేసు ఎట్టకేలకు ఓ కొలిక్కి రాబోతుందని అందరూ భావించినప్పటికీ ప్రభుత్వం విచారణకు ఆదేశించి ఎనిమిది నెలలు గడిచినా ఇంత వరకు ఈ హత్యకు సంబంధించి విచారణ మొదలు కాలేదు. ఈ తరుణంలోనే వైసీపీకి చెందిన ఓ ముఖ్య నాయకునికి ఈ హత్యతో సంబంధం ఉందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. దీనిపై సదరు నేత స్పందిస్తూ తాను ఏ విచారణకైనా సిద్ధమేనని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఎనిమిది నెలలుగా విచారణ ముందుకు సాగకపోవటంతో నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం చేసిన సీఐడీ విచారణ ప్రకటనపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

శాసన సభ దృష్టికి హత్య కేసు

ఈ నేపథ్యంలో శాసనసభ దృష్టికి శ్రీహరిరావు హత్య కేసును అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం తీసుకొచ్చారు. ఈ కేసును సీఐడీకి అప్పగించారు కానీ విచారణ ప్రారంభం కాలేదంటూ హత్యకు సంబంధించిన పూర్వాపరాలను వివరించారు. అసెంబ్లీలో చర్చకు వచ్చిన ఈ హత్యోదంతం విచారణకు ఉన్న అడ్డంకులు తొలగించి హత్య కేసు నిందితులను పట్టుకునేందుకు ఉపకరిస్తుందా? లేక ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తిన విమర్శలు, ప్రతి విమర్శలకే పరిమితమవుతుందా? అన్న ప్రశ్నలు నియోజకవర్గ ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

రక్తదానం ప్రాణదానంతో సమానం

పెనమలూరు, మార్చి20(ఆంధ్రజ్యోతి): గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, విజయవాడ రెడ్ క్రాస్ సొసైటీ గురువారం సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. రక్తదానం చేసేందుకు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ముందుకు వచ్చారు. రక్తదాన శిబిరం ద్వారా 24యూనిట్లు సమకూరినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ రక్తదానం చేయడం అనేది ప్రాణదానంతో సమానమైనదిగా అభివర్ణించారు. రక్తదానం చేసినవారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి , కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.


శిబిరాన్ని పరిశీలిస్తున్న కళాశాల ప్రతినిధులు

చిట్టీల పేరుతో మోసంపై కేసు

పెనమలూరు, మార్చి20 (ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరుతో లక్షలు వసూలు చేసి తిరిగి చెల్లించకుండా ఇద్దరు భార్యాభర్తలు మోసం చేశారంటూ వచ్చిన ఫిర్యాదుపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోరంకి ప్రియానగర్ కాలనికి చెందిన తెర్లాపు ఈశ్వరరావు పోరంకి సెంటరులో మీసేవ కేంద్రాన్ని నడుపుతున్నాడు. ఆయన వద్దకు జిరాక్స్ నిమిత్తం వచ్చే వణుకూరు గ్రామానికి చెందిన గుంటూరు మహేంద్రబాబు, అతని భార్య అనూషల వద్ద చిట్టీల పేరుతో నెలకు పదమూడు వేలు చొప్పున రూ.3.12 లక్షలు చెల్లించాడు. తనకు అవసరం ఉందని, చిట్టీ పాడుకుంటానంటూ ఈశ్వరరావు అడుగగా కుదరదని , డబ్బులు ఇవ్వబోమని, ఏంచేస్తావో చేసుకో అంటూ బెదిరిస్తున్నారని పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

• మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

ఉయ్యూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : క్రీడలవల్ల శారీదారుడ్యంతోపాటు మానసికోల్లాసం పెంపొందుతుందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఏజీఅండ్ఎస్ జీఎస్ కళాశాల ప్రాంగణంలో గార్నేని యుగంధర్ జ్ఞాపకార్థం నిర్మించిన అత్యాధునిక టెన్నిస్ కోర్టును ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావుతో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు చొరవతో గార్నేని జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో క్రీడా ప్రాం గణం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. మహిళా క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించిన బోడె ప్రసాద్ మాట్లాడుతూ మహిళా క్రీడా ప్రాంగణానికి మదర్ థెరీస్సా నామకరణం చేయడం ఆనందదాయ క మన్నారు. పోటీ వాతావరణంలో పురుషులతో సమానంగా మహిళలు సైతం సమర్థత కలిగి ఉన్నారన్నారు. ఉయ్యూరు ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, సిద్ధార్థా అకాడమి కార్యదర్శి పాలడగు లక్ష్మణరావు, ఏపీ లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కామినేని పట్టాభి రామయ్య, అర్జున్ అవార్డు గ్రహీత మైనేని సాకేత్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే బోడె

గంగూరు (కంకిపాడు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గంగూరు గ్రామ పరిధిలోని అంబేడ్కర్ నగర్‌లో రూ. 12 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బోడే ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, సమాంతరంగా పయనిస్తున్నాయన్నారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ ద్వారా రుణాలు పంపిణీ చేస్తుందన్నారు. ఈ రుణాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లతీఫ్, అక్బర్ బాషా, కోయ ఆనంద్, సంగెపు రంగారావు, అబ్దుల్ సలాం, ఇర్ఫాన్ పాషా, నందేటి కోటయ్య, అబ్దుల్ గౌస్, బండారు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

• గృహ నిర్మాణశాఖ ఏఈ దుట్టా చంద్రశేఖర్

హనుమాన్‌జంక్షన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సొంతింటి కలను నెరవేర్చడానికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ విభాగం బాపులపాడు ఏఈ దుట్టా చంద్రశేఖర్ లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. బాపులపాడులో ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే అదనపు ఆర్థికసాయంపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. పేదల కాలనీలు, సొంత స్థలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టిన ఎస్సీ, బీసీ వర్గాలకు రూ.50,000, ఎస్టీ వర్గాలకు రూ.75,000 ఉచితంగా ఆర్థికసాయం అందజేస్తున్నట్టు లబ్ధిదారులకు వివరించారు. ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారందరికి లబ్ధి చేకూరుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల మండలంలో 1360 లబ్ధిదారులు లబ్ధి పొందే అవకాశం వచ్చిందన్నారు. దీనిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ చంద్రశేఖర్

లక్ష్మీతిరుపతమ్మ కల్యాణవేదిక ప్రారంభం 26న

గన్నవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న పాత గన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ దేవస్థాన ఆవరణలో నూతనంగా నిర్మించిన కల్యాణ వేదికను ప్రారంభిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ జాస్తి చౌదరయ్య, సుశీలదేవి సౌజన్యంతో గ్రామస్థులు, భక్తుల సహకారంతో లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదికను నిర్మించినట్టు చెప్పారు. జీ ప్లస్ టూ కల్యాణ వేదికలో గ్రౌండ్ ఫ్లోర్ డైనింగ్ హాల్, ఫస్ట్ ఫ్లోర్‌లో కల్యాణం జరుపుకునేందుకు ఫంక్షన్ హాల్, గెస్ట్ రూమ్‌లు, వెయిటింగ్ హాల్‌ను నిర్మించామన్నారు. అమ్మవారి కల్యాణం జరిగే సమయంలో 500 మందికి పైగా కూర్చునే విధంగా హాలు నిర్మాణం చేశామన్నారు. గ్రామస్థులు శుభకార్యాలు నిర్వహించుకోవచ్చన్నారు. ఈ నూతన కల్యాణ వేదికను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభిస్తారని తెలిపారు. ఆలయ కమిటీ కోశాధికారి జాస్తి ఫణిశేఖర్ పాల్గొన్నారు.


ప్రారంభానికి సిద్ధమైన లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదిక

క్రీడలతో ఆరోగ్యం పదిలం

ప్రసాందంపాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : క్రీడలు శారీరక ధారుడ్యానికి దోహదపడుతాయని విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమన్ కళాశాల ప్రిన్సిపాల్ తూమాటి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కళాశాల ప్రాంగణంలో ఫెడ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు త్రోబాల్, టెన్నికాయిట్, కబడ్డీ, రన్నింగ్, చెస్, క్యారమ్స్ వంటి ఆటల పోటీలు నిర్వహించారు. త్రోబాల్ ఫెనల్స్ ఉత్కంఠభరితంగా సాగింది. విజేతలను కళాశాల ఛైర్మన్ అప్పారావు, కార్యదర్శి బి.శ్రీకృష్ణలు అభినందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి. రాఘవలక్ష్మి, పాల్గొన్నారు.

కోర్టుకు స్థలం కేటాయించాలి

ఉయ్యూరు: ఉయ్యూరులో కోర్టుకు స్థలం కేటాయించాలని ఉయ్యూరు బార్ అసోసియేషన్ (ప్రాక్టీ సింగ్ అడ్వకేట్స్) రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను కోరారు. ఉయ్యూరులో గురువారం ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రి, ఎమ్మెల్యేను అసోసియేషన్ అధ్యక్షుడు సదర్ల ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు చంద్రప్రతాప్ కుమార్, ప్రధాన కార్యదర్శి బి.సురేశ్ ఇతర సభ్యులు, న్యాయవాదులు కలసి వినతి పత్రం అందజేశారు.

గన్నవరం బార్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం

గన్నవరం: గన్నవరం బార్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవంగా గురువారం ఎన్నికైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సీనియర్ న్యాయవాది జీఎస్ఆర్ మూర్తి తెలిపారు. అధ్యక్షుడిగా గారపాటి రవికుమార్, ఉపాధ్యక్షులుగా లోకం వేణుబాబు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.ప్రకాశరావు, కోశాధికారిగా ఆర్.విమల్ కుమార్, జాయింట్ సెక్రటరీగా వీవీఎల్ఎన్ మూర్తి, మహిళా రిప్రజంటేటీవ్‌గా ఎల్ భగీరథి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా జి.సీతారామయ్యలు ఎన్నికైనట్టు చెప్పారు. నూతన కార్యవర్గాన్ని బార్ అసోసియేషన్ సీనియర్ నాయకులు కేవీ రమణ, ఎ.వెంకటేశ్వరరావు, టి.వెంకట్రావు, వైఆర్ శారద, ఎస్జీజీ నీరజా, న్యాయవాదులు ఎ.సోమేశ్వరరావు, చంద్రశేఖర్‌రెడ్డి, నల్లమోతు రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆమోదంపై హర్షం

విజయవాడ రూరల్ : ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఎస్సీ వర్గీకరణపై ఏకగ్రీవ ఆమోదం పొందడంపై ఎంఆర్‌పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు.గురువారంరాత్రి నున్న గ్రామంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నేత మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, ఎన్డీయే ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.ఎంఆర్‌పీఎస్ నేతలు సుబ్బారావు, కోటేశ్వరరావు, చైతన్య పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : ఎస్సీ వర్గీకరణ అమలు అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికను ఆమోదం కోసం అసెంబ్లీలో ప్రవేశ పెట్టడం అభినందనీయమని ఎమ్మార్పీఎస్ గన్నవరం నియోజకవర్గం సమన్వయకర్త ముదునూరు కొండలరావు మాదిగ గురువారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

పీ 4 సర్వేపూర్తి

ఉయ్యూరు: రాష్ట్రప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 సర్వే ఉయ్యూరులో నూరుశాతం పూర్తయినట్టు ఎంపీడీవో జీవీ శేషగిరిరావు తెలిపారు. మండలంలో 10909 కుటుంబాలను సర్వే చేసి 20 శాతం పేద కుటుంబాలను గుర్తించామన్నారు. గ్రామ సభలు నిర్వహించి అర్హులైన వారి జాబితా ప్రకటిస్తామని తెలి పారు.

కూటమిపై విమర్శలు తగదు

హనుమాన్‌జంక్షన్ రూరల్ : రాజకీయంగా తన ఉనికిని కాపాడుకోవడానికే హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావులపై కాంగ్రెస్ నాయకురాలు పద్మశ్రీ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

పారిశ్రామికాభివృద్ధితో యువతకు భవిష్యత్తు


మంత్రి నారా లోకేష్‌తో మల్నీడి వెంకటపతిరావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మల్లవల్లి పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుద్వారా చుట్టుపక్కల గ్రామాల యువతకు మంచి భవిష్యత్తు అందేలా కృషి చేస్తామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్టు బృంద గ్రీన్ ఎస్టేట్ ప్రతినిధి మల్నీడి వెంకటపతి రావు గురువారం తెలిపారు. అశోక్‌లేలాండ్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రిని బుధవారం రాత్రి ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. గత కొన్నేళ్లుగా పారిశ్రామిక రంగంతో పాటు రియల్ ఎస్టేట్ రంగం కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఊపందుకుందన్నారు. అనంతరం మంత్రి లోకేష్‌ను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పర్యావరణ హిత గ్రీన్ వెంచర్ బ్రోచర్‌ను ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తికొండ రవికిరణ్, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం

హనుమాన్‌జంక్షన్ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వీరవల్లిలోని షిరిడీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసరావు, రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో సహస్ర పుష్పార్చన, అష్టోత్తర శతనామావళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లంక రవితేజ, యామిని దంపతులు బాబా వారికి పూజలు నిర్వహించేందుకు అవసరమైన రూ.35,000ల విలువ చేసే వెండిపళ్లెం, గ్లాసును ఆలయకమిటీ సభ్యులు కోడెబోయిన బాబి, రావి ఈశ్వర్‌లకు అందజేశారు. అర్చకులు దాతలకు వేదాశీర్వాదంతో కూడిన స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు. శుక్రవారం విశేషపూజల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.


పూజలు చేస్తున్న రవితేజ, యామిని దంపతులు

వివాదాస్పద స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుగుణ

విజయవాడ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అజిత్‌సింగ్‌నగర్, పైపులరోడ్డు సమీపంలోని అంబాపురం పంచాయతీ స్థలంలో ఇటీవల ఏర్పాటు చేసిన చలివేంద్రం వివాదాస్పదంగా మారింది. పంచాయతీ స్థలంలో చలివేంద్రం ఏర్పాటు చేసి స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణలు రావడంతో గురువారం రూరల్ తహసీల్దార్ సుగుణ చలివేంద్రాన్ని పరిశీలించారు. గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య కొందరితో కలిసి ఇటీవల పంచాయతీ స్థలంలో పాకను ఏర్పాటు చేశారు. సుమారు 400 గజాల స్థలంలోని కొంత భాగంలో పెద్ద పాక వేయడంతో సదరు స్థలం కబ్జాకు గురైందంటూ ఆరోపణలు వినిపించాయి. ఆరోపణల నేపథ్యంలో పాకను కుదించి చలివేంద్రంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయినా రూ. 2 కోట్ల స్థలం చలివేంద్రం పేరుతో కబ్జాకు గురవుతోందంటూ ఆరోపణలు వెల్లువెత్తడంతో రూరల్ తహసీల్దార్ సదరు స్థలాన్ని అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. చలివేంద్రాన్ని పంచాయతీ స్థలం నుంచి బయట ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పంచాయతీ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని గ్రామ ఈవో శ్రీనివాస్‌కు సూచించారు. పంచాయతీ స్థలం చుట్టూర ఫెన్సింగ్ వేసి పరిరక్షించాలని ఆదేశించారు. దీంతో అధికారులు సదరు స్థలంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

• పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి

పెనమలూరు, మార్చి20(ఆంధ్రజ్యోతి): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో నిమగ్నమవ్వాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం తాడిగడపలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గ అధికారులతో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, జరగాల్సిన ఇతర పనుల గురించి సమీక్ష నిర్వహించారు. వీఎంసీ, అనుబంధ శాఖల అధికారులు, కార్పొరేటర్లతో జరిగిన సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పశ్చిమలో జరుగుతున్న మౌలిక సదుపాయాలు ఏర్పాటుకుతోడు మరిన్ని అభివృద్ధి పనులు జరగాలన్నది తన లక్ష్యమన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అందుకోసం అధికారులు ప్రోయాక్టివ్‌గా వ్యవహరించాలని సూచించారు. నీటి సమస్యలను ముందస్తుగానే గుర్తించి పైపులైన్లకు మరమ్మతులు, నూతనంగా పైపులైన్ల నిర్మాణం, బోర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమీక్ష సమావేశంలో జోనల్ కమిషనరు రమ్య కీర్తన, సీఈ శ్రీనాథరెడ్డి, సిటీ ప్లానర్ ప్రసాద్, డీసీపీ చంద్రబోస్, టీపీఓలు మురళీగౌడ్, రిజ్వానా, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంఎస్ బేగ్, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షులు అడ్డూరి శ్రీరాం, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

వ్యక్తి కనిపించడం లేదని కేసు నమోదు

పెనమలూరు, మార్చి20(ఆంధ్రజ్యోతి): గంగూరు గ్రామానికి చెందిన మోహనరావు అనే వ్యక్తి ముఠాపని చేసుకుంటూ జీవిస్తుంటాడు. మద్యం అలవాటున్న అతను అప్పుడప్పుడు కనిపించకుండా పోతుంటాడు. అయితే గత నెల(ఫిబ్రవరి) 23న పాత అలవాటు ప్రకారం ఇంటినుంచి బయటకు వెళ్లిన అతడు ఇప్పటివరకూ తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఐసీ జీఎం వెంకట్రావు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రొత్సహించడమే ధ్యేయం

పెనమలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు ఆర్ వెంకట్రావు పేర్కొన్నారు. కానూరు న్యూ ఆటోనగర్ క్లస్టర్ భవనంలో గురువారం నిర్వహించిన ఉద్యమం రిజిస్ట్రేషన్ క్యాంపులో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రప్రభుత్వం సూక్ష్మ, చిన్న పరిశ్రమల వృద్ధిలో భాగంగా ర్యాంపు ప్రోగ్రాం ద్వారా అందిస్తున్న వివిధ ప్రోత్సాహకాలను వినియోగించుకొని ఎంఎస్ఎంఈ సెక్టార్ అభివృద్ధి చెందాల్సిందిగా ఆకాంక్షించారు. ప్రభుత్వం ప్రాధాన్యతా రంగంలోని ఎంఎస్ఎంఈలకు అందించే రుణ సదుపాయాలు, సబ్సిడీల ద్వారా లబ్ధి పొందేందుకు ఉద్యమం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరని తెలిపారు. క్లస్టరు ఎండీ అన్నే శివనాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సహకారం వినియోగించుకొని ప్రతి ఒక్క పారిశ్రామికవేత్త లబ్ధి పొందాలని సూచించారు.


ఇళ్ల స్థలాలివ్వాలని ఆందోళన చేస్తున్న పి.నైనవరం వాసులు

గ్రామ పరిధిలోనే స్థలాలివ్వాలి

విజయవాడ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామపరిధిలోని భూముల్లోనే తమకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పి. నైనవరం గ్రామస్థులు గురువారం ఆందోళన చేపట్టారు. ఆందోళనలో భాగంగా ఇళ్లపట్టాల లబ్ధిదారులు గ్రామం నుంచి కుక్కల వారి కుంట వరకు ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం అనుబంధ ప్రజా సంఘాల జిల్లా నేత కోట కల్యాణ్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పి. నైనవరం గ్రామానికి చెందిన 286 ఇళ్లు లేని కుటుంబాలకు పక్కనే ఉన్న పాతపాడులో ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. అయితే సొంత గ్రామంలో కాకుండా పక్క గ్రామంలో ఇళ్లు కేటాయించడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. సీపీఎం నేత మాతంగి ఆంజనేయులు, సీఐటీయూ నేత ఏ. వెంకటేశ్వరరావు, జీవి. రంగారెడ్డి పాల్గొన్నారు.

ఆందోళనకారులతో మాట్లాడిన తహసీల్దార్..

ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆందోళన చేపట్టిన నేతలతో రూరల్ తహసీల్దార్ సుగుణ గురువారం మాట్లాడారు. సదరు స్థలం ఇరిగేషన్‌కు సంబంధించిన స్థలం అని, దీన్ని కేటాయించడం కుదరదని ఆమె చెప్పారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని ఆందోళనకారులు తెలిపారు.

ప్రకృతి ఒడిలో.. కొంత కాలం

కంచలలో 'తత్వవనం' పేరుతో తొలి పీపీపీ ఎకో టూరిజం ప్రాజెక్టు



నిర్వాహకులతో కలిసి తత్వవనంలోని నిర్మాణాలను పరిశీలిస్తున్న నూకసాని బాలాజీ

- వెల్‌నెస్, ఎకో, స్పోర్ట్స్ టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి
- ఏపీటీడీసీతో ఎంవోయూకు నిర్వాహకులు సిద్ధం
- ప్రాజెక్టును సందర్శించిన ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని

జిల్లాలోని నందిగామ దగ్గర్లో ఉన్న కంచలలో పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో తొలి ఎకో టూరిజం ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. మొట్టమొదటి ఫామ్ గేటెడ్ కమ్యూనిటీగా అభివృద్ధి చేస్తున్న ప్రైవేటు సంస్థ, రాష్ట్ర ప్రభుత్వపు తాజా పర్యాటక పాలసీ ప్రకారం ఎకో టూరిజం, వెల్‌నెస్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)తో కలిసి పని చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం తన విజన్ -2047 ప్రణాళికలో భాగంగా పర్యాటక రంగాన్ని విశేషంగా అభివృద్ధి చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించింది. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు పలు రకాల టూరిజాన్ని ప్రోత్సహిస్తూ ప్రత్యేక రాయితీలను అందిస్తోంది. ఏపీటీడీసీతో ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకునేందుకు సిద్ధమవుతోంది. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

నందిగామ నియోజకవర్గం తుర్లపాడు మండలం, కంచల గ్రామంలో మున్నేరు నది ఒడ్డున 'తత్వవనం - షేర్ జాయ్ విత్ నేచర్' పేరుతో ఒక రిసార్ట్‌ను నిర్మిస్తున్నారు. దీన్ని ఎకో, వెల్‌నెస్, స్పోర్ట్స్ టూరిజం సెంటర్‌గా తీర్చిదిద్దాలని నిర్వాహకులు భావిస్తున్నారు. పర్యాటకులు ప్రకృతి ఒడిలో కొంతకాలం జీవించాలనుకుంటే ఇక్కడికి రావచ్చు. చుట్టూ ఉన్న పొలాల్లో కూరగాయలు, ఉద్యానతోటలను అభివృద్ధి చేస్తారు. కూరగాయల సాగు, ఉద్యానపంటల సాగు వంటివి చేసుకుంటూ రిసార్ట్‌లో హాయిగా గడపవచ్చు. ఇక్కడ సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి అందాలు, యోగా, ధ్యానం, ఆయుర్వేద చికిత్సలు, సంప్రదాయ వంటకాలతో సేవలందిస్తారు. పూర్తిగా పర్యావరణ అనుకూల నిర్మాణాలు కొన్ని చేపట్టారు. మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయి. ఇక్కడ పూర్తిగా గ్రామీణ వాతావరణం కనిపిస్తుంది. మున్నేరు నది ఒడ్డున పక్షుల కిలకిలారావాలు, వాగు శబ్దాల మధ్య పర్యాటకులకు మైమరపించే అనుభూతిని పంచేలా రిసార్ట్‌ను రూపొందిస్తున్నారు. టేబుల్ టెన్నిస్, క్రికెట్ నెట్, బ్యాడ్మింటన్ కోర్టు, బాస్కెట్‌బాల్ నెట్, ట్రాంపాలిన్ వంటివి ఆడుకోవచ్చు. రివర్ సైడ్ క్యాంపింగ్, గోశాల, పాకెట్ గార్డెన్, ఆర్గానిక్ ఫుడ్ వంటి 12కు పైగా ఫామ్ హౌసెస్, లగ్జరీ క్లబ్ హౌస్‌లు, జాగింగ్ ట్రాక్, డే వ్యూ, నైట్ వ్యూ వంటి అనేక సదుపాయాలుంటాయి. తత్వవనం ప్రాజెక్టు ఎన్టీఆర్ జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే ఎకో, వెల్‌నెస్, స్పోర్ట్స్ టూరిజంకు దరఖాస్తు చేసుకున్న ప్రాజెక్టు కావటంతో ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ ఇటీవల దీన్ని సందర్శించారు. దాదాపుగా 85 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఈ రిసార్ట్ వివరాలను ఫౌండర్ నరేంద్ర, డైరెక్టర్ ఒక్కలిగడ్డ భాస్కర్ చైర్మన్ బాలాజీకి వివరించారు. దీంతో రిసార్ట్ మొత్తం కలియ తిరిగిన ఆయన ఈ రిసార్ట్ ఒక అద్భుతమైన పర్యాటక ప్రాజెక్టుగా నిలుస్తుందని కొనియాడారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సీఎం సహకారంతో ఈ ప్రాజెక్ట్‌ను మరింత ప్రోత్సహించి, రాష్ట్ర పర్యాటక రంగంలో ప్రత్యేకస్థానం కల్పిస్తామన్నారు. ప్రభుత్వ సాయంతో ఈ ప్రాజెక్ట్ విజయవంతం కావడానికి అన్ని విధాలా మద్దతు ఉంటుందన్నారు.

పర్యాటక రంగంలో కొత్త ఉత్తేజం

తత్వవనం రిసార్ట్‌లో కార్పొరేట్ సమావేశాలు, కుటుంబ సమ్మేళనాలు, జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు అనుకూలంగా ప్రత్యేక సదుపాయాలున్నాయి. దీంతో స్థానికులకు ఉపాధితో పాటు, గ్రామీణ సంస్కృతిని ప్రోత్సహించి, స్థానిక వ్యవసాయ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి స్థాయిలో ప్రారంభించటానికి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

మహారే.. 'మాయా'

ముగిసిన సురభి నాటకోత్సవాలు



నాటకంలో కృష్ణుడితో ఘటోత్కచుడి సన్నివేశం

విజయవాడ కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ నాటక రంగానికి చిరస్మరణీయంగా నిలిచిన సురభి బృందం 'మాయాబజార్' నాటక ప్రదర్శనతో ప్రేక్షకుల అభినందనల వెల్లువ కురిసింది. సురభి నాట్యకళ మండలి, సురభి ఆర్ట్స్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో మాయాబజార్ పౌరాణిక సురభి నాటకం నగరంలోని శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత, నృత్య కళాశాలలో జరిగిన సురభి నాటక మహోత్సవాల చివరి రోజైన గురువారం 'మాయాబజార్' ప్రదర్శన జరిగింది. హాస్యం, ఇంద్రజాలం, సంగీతం, భావోద్వేగాలతో కూడిన ఈ నాటకం ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. ఈ నాటకంలో ఘటోత్కచుడి అల్లరి, చతురత, మాయాశక్తులతో మెప్పించగా, శ్రీకృష్ణుడు తన మేధస్సుతో కథనాన్ని ముందుకు నడిపించడం, లక్ష్మణ కుమారుడు తన హాస్యంతో ప్రేక్షకులను విపరీతంగా నవ్వించగా, అభిమన్యుడు - శశిరేఖల ప్రేమకథ ఈ నాటకానికి ప్రత్యేక అందాన్ని అందించింది. హిడింబ పాత్రలోని శక్తి, తల్లిగా ఆమె ముద్దుగా మెలిగిన తీరు భావోద్వేగాన్ని పంచింది. మాధుర్యంగా ఆలపించిన పాటలు, ఘటోత్కచుడి మాయా వీరంగాలు, శ్రీకృష్ణుడి చతురత ఇవన్నీ ప్రేక్షకుల నుంచి హర్షధ్వానాలు తెచ్చుకొన్నాయి. రంగస్థల రూపకల్పనలో చూపిన క్రియేటివిటీ అద్భుతంగా అనిపించింది. ప్రతి పాత్ర తనదైన శైలిలో న్యాయం చేసింది. దర్శకత్వం, రంగస్థల రూపకల్పనలో దర్శకత్వం - సురభి ప్రసాద్, పర్యవేక్షణ - సురభి రాయలు ప్రతిభను చాటారు. శ్రీకృష్ణుడు - నిఖిలేష్ సురభి, బలరాముడు - నాగబాబు, ఘటోత్కచుడు - సురభి సంతోష్, అభిమన్యుడు - భానుప్రసాద్, హిడింబ - ప్రియాంక, సతీషలు తమ పాత్రల నటన అభినయాలతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.



మాయాబజార్ నాటకంలో హావభావాలు పలికిస్తున్న కళాకారులు



మొదటగా దుస్తులు కొనుగోలు చేసిన పువ్వాడ రామప్రసాద్‌కు దుస్తులు అందజేస్తున్న గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు

నాణ్యతకు మారుపేరు రామరాజ్ కాటన్ దుస్తులు

గొర్రెపాటి గోపీచంద్ ● మచిలీపట్నంలో ఘనంగా రామరాజ్ కాటన్ షోరూం ప్రారంభం

మచిలీపట్నం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రామరాజ్ కాటన్ దుస్తులు నాణ్యతతో అందరి మన్ననలు పొందుతున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మచిలీపట్నం బృందావన్ టాకీసు ఎదురుగా నూతనంగా ప్రారంభించిన రామరాజ్ కాటన్ షోరూంను మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, జనసేన నగరాధ్యక్షుడు గడ్డం రాజుతో కలసి గొర్రెపాటి గోపీచంద్ జ్యోతి ప్రజ్వలన చేసి దుస్తుల అమ్మకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ నారాయణ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల్లో 400 షోరూంలు ప్రారంభించారన్నారు. కమిషనర్ పి.బాపిరాజు మాట్లాడుతూ నాణ్యమైన కాటన్ వస్త్రాలకు రామరాజ్ పేరు మోసిందన్నారు. ఏజీఎం డీ శ్రీనివాసులు, జోనల్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలతో పాటు సింగపూర్, శ్రీలంక, మలేషియాల్లోనూ షోరూంలు ప్రారంభించారన్నారు. ఇలా ఇప్పటికే 400 శాఖలు ఉన్నాయన్నారు. దక్షిణ భారతదేశంలోనే కాకుండా ఉత్తర భారతదేశంలోనూ షోరూంలు ప్రారంభించేందుకు బ్రాండ్ అంబాసిడర్ అభిషేక్ బచ్చన్‌తో సంప్రదింపులు జరిపామన్నారు. త్వరలో తాడేపల్లిలో మంత్రి నారా లోకేశ్‌తో ఒక షోరూం ప్రారంభిస్తున్నామన్నారు. ఏరియా మేనేజర్ ఉదయభాస్కర్, క్లస్టర్ మేనేజర్ రాకేష్, మచిలీపట్నం షోరూం మేనేజర్ శివసాయి మాట్లాడారు. నగరంలోని ప్రముఖులు, బ్యాంకు మేనేజర్లు, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమంగా తీసుకెళ్లాలి

● ఖరీఫ్ కార్యాచరణ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ



రైతును సత్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మన మనుగడకు ప్రతి మట్టి రేణువూ, వర్షపు చినుకూ ఆధారమేనని, ప్రకృతి వ్యవసాయాన్ని జిల్లాలో ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయం - ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రసాయన పురుగుమందులు, ఎరువులు నెమ్మది నెమ్మదిగా మనిషి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, సాగులో సేంద్రీయ ఎరువులు, జీవ ఉత్ప్రేరకాలు, కషాయాలు/ద్రావణాల వినియోగంతో ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులు చేతికందుతాయని కలెక్టర్ వివరించారు. ప్రతి గ్రామంలో రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించాలని, స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రకృతి సాగుదిశగా నడిపించాలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చేయూతతో నిమ్మ, సపోటా, డ్రాగన్ ఫ్రూట్, ఆపిల్ బేర్, దానిమ్మ తదితర పండ్ల తోటలతో పాటు పూలసాగు వంటి 19 రకాల ఉద్యాన పంటలను చేపట్టవచ్చన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో వ్యవసాయ రంగ వృద్ధిని 6 నుంచి 15 శాతానికి తీసుకెళ్లేందుకు అధికారులు కృషిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రకృతి సాగుతో ముందుకెళ్తున్న రైతులు వెంకట గురుప్రసాద్ (నున్న), శ్రీనివాసరెడ్డి (రెడ్డిగూడెం)ని కలెక్టర్ సత్కరించారు. జిల్లా వ్యవసాయ అధికారి, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్ డీఎంఎఫ్ విజయకుమారి, డ్వామా పీడీ ఏ రాము, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కల్పన, జిల్లా ఉద్యాన అధికారి పీ బాలాజీ కుమార్, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ అధికారి పీఎం సుభానీ, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ కే ఉషారాణి, ఏటీఎంఏ పీడీ యూ నర్సింహారావు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ మేనేజర్ ఎన్.కిరణ్‌కుమార్, ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ అధికారులు, సిబ్బంది డి.జాన్, జీవీఎస్ జానకమ్మ, బి.ప్రభాకర్ పాల్గొన్నారు.

శిరీష్మ ట్రస్టు సేవలు స్ఫూర్తిదాయకం

వేసవిలో చల్లని తాగునీటిని అందించే కార్యక్రమం అందరూ భాగస్వాములవ్వాలని, ప్రజల దాహార్తి తీర్చేందుకు ముందుకు రావాలని, చలసాని శిరీష్మ కుటుంబసభ్యుల సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని దాతల సహకారంతో జిల్లావ్యాప్తంగా చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు చల్లని నీరు, మజ్జిగ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. చలసాని శిరీష్మ జ్ఞాపకార్థం కుటుంబసభ్యుల అధ్వర్యంలో రాఘవయ్య పార్కు సమీపంలో ఏర్పాటు చేసిన ఉచిత తాగునీరు ఆర్వో ప్లాంట్, వైద్యశిబిరాలను గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు అందించేందుకు పెద్దగా ఖర్చు చేయాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్క రూ వారి ఇల్లు లేదా వ్యాపార సంస్థ వద్ద మట్టికుండలను, కూలింగ్ టిన్నులను ఏర్పాటు చేసుకొని దాహం తో వున్నవారికి చల్లని నీరు, మజ్జిగలను పంపిణీ చేయాలని కలెక్టర్ తెలిపారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్, చలసాని శ్రీనివాసరావు, డాక్టర్ రామశేషయ్య, టి.లక్ష్మీనారాయణ, సామంతపూడి చైతన్య, ఎస్.నారాయణ, డి.సత్యనారాయణ రెడ్డి, పి.రమేష్, సీవీఆర్ ప్రసాద్, నజీరుద్దీన్ పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత

గొల్లపూడి: ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాముకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారని పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్‌ల గోదామును అధికారులు, రాజకీయ నాయకులతో కలిసి పరిశీలించారు. సీసీ కెమేరాల పని తీరు, అగ్నిమాపక దళ పరికరాలు తదితరులను పరిశీలించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, వై.రామయ్య (టీడీపీ), ఎం.వినోద్‌కుమార్ (బీఎస్పీ), తరుణ్ కాకాని (బీజేపీ), వై.యేసుదాసు (ఐఎన్‌సీ), కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కబ్జా బాధితులకు దొరకని న్యాయం

● నెలరోజులైనా కేసు నమోదు చేయని నున్న పోలీసులు ● రాజకీయ ఒత్తిళ్లే కారణమని బాధితుల ఆరోపణ

పాయకాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కండ్రిక కాలనీ సమీపంలోని ప్రైవేట్ వెంచర్ స్థలాలని నమ్మి కార్పొరేషన్ స్థలాలు కొని మోసపోయిన బాధితులకు న్యాయం దొరకడం లేదు. ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ స్థలంగా నమ్మించి మోసగించిన కబ్జాదారులు బయట దర్జాగా తిరుగుతుంటే, లక్షలాది రూపాయలు మోసపోయిన బాధితులు పోలీసు స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమను మోసగించిన వ్యక్తిపై ఫిర్యాదు చేసి నెల రోజులైనా కేసు నమోదు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వివరాల ప్రకారం స్థానిక కండ్రిక కాలనీకి సమీపంలోని ఆంధ్ర సిమెంట్ ఫ్యాక్టరీ ఎంప్లాయిస్ అండ్ ఇండస్ట్రియల్ వర్క్స్ హౌస్ సొసైటీ లిమిటెడ్ వెంచర్‌కు మధ్య 4000 గజాల వీఎంసీ స్థలం ఉంది. గత వైసీపీ పాలనలో వైసీపీ ఎమ్మెల్సీ అనుచరుడు ఈ స్థలాన్ని కబ్జా చేసి సిమెంట్ ఫ్యాక్టరీ వెంచర్‌గా నమ్మించి అమ్మకానికి పెట్టాడు. ఈ స్థలాలను అతడు తన తండ్రితో రిజిస్ట్రేషన్లు చేయించాడు. ఇటీవల స్థలాలు కబ్జా చేసి అమ్మకాలు జరుపుతున్నట్టు ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి ఆ స్థలాల్లో వేసిన సరిహద్దు రాళ్లను తొలగించి హెచ్చరిక బోర్డులు పెట్టారు. అప్పటికే 20 స్థలాలను అమ్మేసినట్టు తెలిసింది. దీంతో బాధితులంతా న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. అప్పట్లోనే నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయం చేస్తామన్న పోలీసులు నేటికీ బాధితులను గానీ, మోసగించిన వ్యక్తులను గానీ విచారించలేదు. బాధితులు స్టేషన్‌కు వెళ్లినా తిప్పించడమే తప్ప కేసు నమోదు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వార్డు సభ్యులపై ఎస్సీ, ఎస్టీ కేసు



బోర్డు సమావేశంలో మహిళలపై దురుసుగా ప్రవర్తిస్తున్న వార్డు సభ్యుడు చిట్టిబాబు (ఫైల్‌ఫొటో)

మైలవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మైలవరం పంచాయతీ సర్పంచ్ గరికపాటి మంజు భార్గవి ఫిర్యాదు మేరకు 12వ వార్డు సభ్యుడు ముద్ర నాగ వెంకట చిట్టిబా బు, 18వ వార్డు సభ్యుడు ఎ ర్రా రమేష్‌పై పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేశా రు. ఈనెల 17న మైలవరం పంచాయతీ కార్యాలయంలో జరిగిన బోర్డు సమావేశం మధ్యలోనే సర్పంచ్ వెళ్లిపోయినట్టు చిట్టిబాబు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. కులం పేరుతో రమేష్ అనే వార్డు సభ్యుడు హేళనగా మాట్లాడినట్టు సర్పంచ్ ఫిర్యాదు చేయడంతో వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

మిషన్ వాత్సల్యతో శిశు క్షేమం, సంక్షేమం

● జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నిస్సహాయ స్థితిలో ఉన్న, అవసరాలున్న చిన్నారుల క్షేమం, సంక్షేమం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న మిషన్ వాత్సల్యను లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఏర్పాటైన గ్రామ, వార్డు స్థాయి కమిటీలు క్రియాశీలం కావాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో మిషన్ వాత్సల్య - శిశు సంక్షేమ, రక్షణ జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. మిషన్ వాత్సల్య లక్ష్యాలు, జిల్లాలో వాటి సాధనలో పురోగతిపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిశు సంరక్షణ చట్టాలు, కుటుంబ ఆధారిత సంరక్షణకు ప్రోత్సాహం, సంస్థాగత మద్దతు, ఆర్థిక సహకారం, శిశు సంరక్షణ పథకాల అనుసంధానంతో మిషన్ వాత్సల్య అమలుకు చర్యలు తీసుకొంటున్నామని, ఈ క్రమంలో సర్పంచ్ / కౌన్సిలర్ / కార్పొరేటర్ చైర్మన్‌గా గ్రామ, వార్డుస్థాయి కమిటీలు ఏర్పాటయ్యాయని, ఇవి 15 రోజులకొకసారి తప్పనిసరిగా సమావేశం కావాలని సూచించారు. జిల్లా న్యాయసేవల సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య, డీసీపీ కేజీవీ సరిత, జడ్పీ సీఈవో వై.కన్నమనాయుడు, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, జిల్లా శిశు సంరక్షణ అధికారి ఎం.రాజేశ్వరరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జి.మహేశ్వరరావు, ఏసీపీ కె.లతాకుమారి, సాంఘిక సంక్షేమ అధికారి కెఎస్.శిరోమణి, లేబర్ కమిషనర్ సిహెచ్. ఆశారాణి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మావతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ప్రొహిబిషన్ ఆఫీసర్ టి.జ్యోతి, డీసీపీయూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి భూముల వేలం పాట రద్దు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వన్‌టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మైలవరం నియోజకవర్గం, జి.కొండూరు మండలం, ఆత్కూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన రూ.23.82 సెంట్ల భూమికి ఇటీవల నిర్వహించిన బహిరంగ వేలం పాటలో జరిగిన అవకతవకలపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి బహిరంగ వేలంపాటను రద్దు చేశారు. ఈనెల 5న రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈవో నాగరాజు ఆత్కూరు గ్రామంలోని దేవస్థానానికి చెందిన 23.82 సెంట్ల భూమికి బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ పాటలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి భూమి మొత్తానికి ఏడాదికి రూ.48వేలు చెల్లించుకునేలా పాడుకున్నాడు. అయితే ఆ వ్యక్తి ఓ ప్రముఖ కంపెనీకి సబ్ లీజుకిచ్చి ఏడాదికి సుమారు రూ.5లక్షలకు పైనే తీసుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆ కంపెనీ నిర్వాహకులు తమ సామగ్రిని, వాహనాలు, ఇతర వస్తువులను డంప్ చేసేందుకు ప్రయత్నించారు. దేవస్థానం నిబంధనలకు విరుద్ధంగా ఆదాయానికి గండికొట్టేలా వ్యవహరించటంపై బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'రామలింగేశ్వరస్వామికే శఠగోపం' అనే ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ పామర్తి సీతారామయ్య, ఇన్‌స్పెక్టర్ సుజన్ ఈవో నాగరాజుతో కలిసి దేవస్థానం భూమిని పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేలం పాటలో అవకతవకలు జరిగాయని నిర్ధారించుకున్న సహాయ కమిషనర్ పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వేలం పాటను రద్దు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ బహిరంగ వేలం పాట నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని, దేవస్థానానికి నష్టం కలిగించేలా ఉండటంతో పాటను రద్దు చేసినట్టు చెప్పారు. ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని త్వరలోనే మరోసారి వేలం పాట నిర్వహిస్తామన్నారు.



ఎన్జీవో రాష్ట్ర నేతలకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

పాదయాత్రలో హామీని నిలబెట్టుకోండి

● రాష్ట్ర ప్రభుత్వానికి ఈ-సేవ ఉద్యోగుల వినతి

ధర్నాచౌక్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమకు ఉద్యోగావకాశాలు కల్పించి న్యాయం చేయాలని గవర్నమెంట్ అర్బన్ ఈ-సేవ ఉద్యోగులు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీ ఈ (మీ) సేవ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో 'విజ్ఞాపన దీక్ష' గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ ప్రజలకు అన్ని సేవలు ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో 2003లో నాటి, ప్రస్తుత సీఎం చంద్రబాబు ఈ-సేవ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. 2019లో రాష్ట్రంలో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఈ-సేవ సెంటర్లను మూసివేయడంతో తాము ఉపాధి కోల్పోయామని, ఎన్ని ఆందోళనలు చేపట్టిన పట్టించుకోలేదని దుయ్యబట్టారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు చేసిన పాదయాత్రలో తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీక్షకు సంఘీభావం తెలిపిన ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కేవీ.శివారెడ్డి, ఏ విద్యాసాగర్‌కు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ దీక్షను సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు ప్రారంభించారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్బరావమ్మ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌సీహెచ్.శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.నాగేశ్వరరావు, వివిధ జిల్లా కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెనుమాక రైతులకు ప్లాట్ల కేటాయింపు

● సీఆర్‌డీఏ ఆఫీసులో ఈ - లాటరీ

ఆంధ్రజ్యోతి, విజయవాడ: అమరావతి రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక రైతులకు సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. 510 మంది రైతులకు గురువారం సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ- లాటరీ విధానంలో మొత్తం 1,352 ప్లాట్లను కేటాయించారు. వీటిలో 787 నివాస ప్లాట్లు కాగా 565 వాణిజ్య ప్లాట్లున్నాయి. ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ఈ-లాటరీ విధానంలో సీఆర్‌డీఏ అధికారులు రైతులకు కేటాయించారు. ఈ - లాటరీకి హాజరైన రైతులకు ముందుగా సీఆర్‌డీఏ అధికారులు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ఏ విధంగా ప్లాట్లను కేటాయిస్తారో ట్రయల్ రన్ వేసి చూపించారు. తర్వాత అసలైన లాటరీ ప్రక్రియను చేపట్టారు. ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు మాట్లాడుతూ రైతులకు కేటాయించిన ఎల్పీఎస్ లేఅవుట్లలో అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ ప్లాట్లు పొందిన రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు. కొత్తగా 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆఫీస్ మేనేజ్‌మెంట్) వల్లభనేని శ్రీనివాసరావు, సీఆర్‌డీఏ ల్యాండ్స్ విభాగ జాయింట్ డైరెక్టర్ డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎజి.చిన్నికృష్ణ, వసంత రాయుడు, ప్రిన్సిపల్ ప్లానర్ ఆర్.నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

దుర్గగుడిలో అన్న వితరణకు రూ.2 లక్షల విరాళం

ఇంద్రకీలాద్రి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గుడివాడకు చెందిన సుంకర బాలాంబ తమ కుటుంబ సభ్యులతో గురువారం కనకదుర్గమ్మ ఆలయానికి విచ్చేసి అన్నవితరణకు రూ.2,00,116ను విరాళంగా అందించారు. దాత కుటుంబీకులకు అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీస్సులు అందించారు. లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.



దాత సుంకర బాలాంబ, కుటుంబసభ్యులకు కనకదుర్గమ్మ చిత్రపటాన్ని అందిస్తున్న అధికారులు, అర్చకులు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి వాసుదేవ్

చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం

పామర్రు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుంచే చట్టాలపట్ల అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు గుడివాడ సివిల్ న్యాయాధికారి ఎస్.వాసుదేవ్ సూచించారు. టీకేఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశనుంచే చట్టాలు తెలిసుంటే సమాజంలో జరిగే అన్యాయాలపై ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయొచ్చన్నారు. బాలికలను ఎవరైనా వేధిస్తే తక్షణ చర్యలు తీసుకునేలా చట్టాలున్నాయన్నారు. దిశ, పోక్సో, గృహ హింస చట్టాలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. గుడ్, బ్యాడ్ టచ్‌లపై సీఐ శుభకర్ వివరించారు. మానవ అక్రమ రవాణా, సైబర్‌నేరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాజేంద్రప్రసాద్ సూచించారు. షీటీమ్స్ గురించి ఆయన వివరించారు. కళాశాల ప్రాంగణంలోని బాలికల వసతి గృహంలో విద్యార్థుల సౌకర్యాలపై న్యాయాధికారి వాసుదేవ్ ఆరా తీశారు. డిప్యూటీ తహసీల్దార్ జి.గోపాల్ పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం

● సహకార సంఘాల జిల్లా అధికారి చంద్రశేఖర్‌రెడ్డి

గుడివాడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని, కో-ఆపరేటివ్ వ్యవస్థ బలపడితేనే అర్బన్ బ్యాంకులు మరిన్ని సేవలను అందిస్తాయని సహకార సంఘాల జిల్లా అధికారి కె.చంద్రశేఖరరెడ్డి అన్నారు. గురువారం ది గుడివాడ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025 సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా చంద్రశేఖరరెడ్డి విచ్చేశారు. సహకార సంఘాల అభివృద్ధి, సంఘాల బలోపేతంపై దృష్టిసారించాలని అధికారులకు ఆయన సూచించారు. సహకార సంఘాలు మెరుగైన సమాజాన్ని నిర్మించేందుకు దోహదపడతాయన్నారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి పీఆర్వీ రమణారెడ్డి, గుడివాడ విభాగ సహకార అధికారి వీవీ ఫణికుమార్, అర్బన్ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్ సీహెచ్ రవికుమార్, సీఈవో టి.ఎస్ఎస్ఆర్ చౌదరి, బ్యాంకు సిబ్బంది, ఇతర సంఘాల అధికారులు పాల్గొన్నారు.

ఎస్టీ, ఎస్సీ, బీసీ, గృహ నిర్మాణదారులకు
అదనపు ఆర్థిక సాయం

గుడ్లవల్లేరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన(పీఎంఏవై) మన ఇల్లు మన గౌరవం పథకంలో భాగంగా ఇంటి నిర్మాణం చేసుకోవాలనే వారికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త అవకాశాలను కల్పిస్తోందని గృహనిర్మాణ శాఖ మండల ఇన్‌చార్జ్ సహాయ ఇంజనీర్ ఆలపాటి సురేంద్ర అన్నారు. గురువారం గ్రామంలో పీఎంఏవై 2.0 సర్వేను సిబ్బందితో కలిసి ఆయన నిర్వహించారు. ఈ పథకంలో గృహనిర్మాణానికి గతంలో ఇచ్చే రూ.1,80,000 తోపాటు ఎస్టీ కేటగిరీకి రూ.75,000, ఎస్సీ, బీసీ కేటగిరీ లబ్ధిదారులకు రూ.50,000 అదనంగా ఆర్థిక సాయం అందిచనున్నారని సురేంద్ర తెలిపారు. గృహనిర్మాణం వెంటనే ప్రారంభించి 30 రోజుల్లోగా పూర్తి చేసుకునే పీఎంఏవై 1.0 దరఖాస్తుదారులకూ రాష్ట్ర ప్రభుత్వం ఈ అవకాశాలను కేటగిరీ వారీగా కల్పిస్తోందని ఆయన వివరించారు.



గుడ్లవల్లేరులో పీఎంఏవై సర్వే చేస్తున్న గృహనిర్మాణశాఖ అధికారులు

బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండండి

● యువతకు సీఐ కె.శ్రీనివాస్ సూచన

గుడివాడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు యువత దూరంగా ఉండాలని, జీవితాలు నాశనమవుతాయని వన్‌టౌన్ సీఐ కె.శ్రీనివాస్ అన్నారు. గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 22 నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్న నేపథ్యంలో యువత, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బెట్టింగ్‌ల వలన లక్షలాది రూపాయలు పోగొట్టుకుని, అప్పుల పాలై, వాటిని చెల్లించలేక సెల్ఫీలు తీసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

అగ్ని బాధిత కుటుంబానికి సాయం

కూచిపూడి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): భట్లపెనుమర్రులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చీలి రాణి కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొవ్వ మండల శాఖ వంట పాత్రలు, టార్పాలిన్లు, కాస్మోటిక్స్, దుప్పట్లు పంపిణీ చేసింది. తహసీల్దార్ కె.మస్తాన్, ఎస్సై నాగవిశ్వనాథ్, రెడ్‌క్రాస్ మొవ్వ మండల శాఖ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, కూచిపూడి రోటరీక్లబ్ అధ్యక్షుడు కోనేరు మంజునాథ్, జొన్నలగడ్డ హనుమకుమార్, కె.రామాంజనేయులు, మద్దాల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వంటపాత్రలు అందిస్తున్న తహసీల్దార్ మస్తాన్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

అహ్మదీయ ముస్లింల సేవలు అభినందనీయం

అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ సేవలు అభినందనీయమని తహసీల్దార్ కె.మస్తాన్ అన్నారు. భట్లపెనుమర్రు అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ హ్యూమానిటీ ఫస్ట్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసరాలు, వంట పాత్రలు అందించారు. ఎస్సై కె.ఎన్.విశ్వనాథ్, ముస్లిం కమ్యూనిటీ సభ్యులు మహ్మద్ యాకుబ్ పాషా, షేక్ ఇస్మాయిల్, హజరత్ మీర్జా గులామ్ అహ్మద్, షేక్ కాశిం, మహమ్మద్ ఇస్మాన్, షేక్ మౌలాలి, షేక్ నాజర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

కాలక్షేప మండపం అభివృద్ధికి విరాళాలు

గుడివాడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మెయిన్‌రోడ్డులోని విఘ్నేశ్వరస్వామి దేవస్థానం కాలక్షేప మండపం అభివృద్ధికి పలువురు దాతలు విరాళాలు ఇచ్చారని ఆలయ ఈవో వై.శ్రీనివాసరావు(వాసు) తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో దాతలు మూడెడ్ల రామారావు భార్య లక్ష్మీరంగ రూ.51,000, ఏఈ బరిగెల రాధాకృష్ణ, సుజాత దంపతులు రూ.25,000, అడబాల దుర్గాప్రసాద్, నాగశ్రీ దంపతులు రూ.10,116, గంటా చంద్రశేఖర్, ఉషాదంపతులు రూ.10,116, పంచకర్ల వెంకట్, సుమతి దంపతులు రూ.5,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ శాయన రాజేష్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

సిబ్బంది లేక సతమతం

తోట్లవల్లూరు పీఎస్‌లో ఉండాల్సింది 28 మంది.. ఉన్నది 18

● నైట్‌బీట్లు కుదింపు ● పనిచేయని సీసీ కెమెరాలు

● నిఘా తగ్గడంతో వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు కత్తిరించుకుపోతున్న దొంగలు





తోట్లవల్లూరు కరకట్టపై పనిచేయని సీసీ కెమెరాలు

(ఆంధ్రజ్యోతి-తోట్లవల్లూరు): తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత ఏర్పడింది. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా పది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో ఎనిమిది కానిస్టేబుళ్లు, రెండు ఏఎస్సై పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హోంగార్డుల సంఖ్య కూడా తక్కువగానే ఉంది. సిబ్బంది కొరత ఉండడంతో నైట్‌బీట్లను కుదించారు. దీంతో దొంగలకు భయం కొరవడింది. పోలీస్‌స్టేషన్‌లో మొత్తం 28 మంది సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం 18 మంది ఉన్నారు. పదిమంది హోంగార్డులకు ఇద్దరే విధులకు వస్తున్నారు. కానిస్టేబుళ్ల, హోంగార్డుల కొరత ఉండడంతో శాంతిభద్రతల పర్యవేక్షణ కుంటుపడిపోయింది. గతంలో ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డుతో నాలుగు గ్రామాలకొక నైట్‌బీట్ వేసేవారు. 16 గ్రామాలకు నాలుగు నైట్‌బీట్లు వేసేవారు. రాత్రి 9 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు నైట్‌బీట్ సిబ్బంది గ్రామాల్లో తిరుగుతూ ఉండేవారు. కొంతైనా దొంగలకు భయం ఉండేది. ప్రస్తుతం సిబ్బంది కొరత వల్ల మూడు నైట్‌బీట్లను నిలిపివేశారు. ఒక్క నైట్‌బీట్ మాత్రమే వేస్తున్నారు.

ఉన్నవారినే వినియోగించుకుంటున్నాం

పోలీస్‌స్టేషన్‌లో ఉన్న 18 మంది సిబ్బందితో డ్యూటీలు నిర్వహిస్తున్నాం. బందోబస్తులకు ఈ 18 మందిలోనే వెళ్లాల్సి వస్తోంది. హోంగార్డులు ఇద్దరే ఉన్నారు. ఉన్నవారిని వినియోగించుకుంటున్నాం. సీసీ కెమెరాలు పనిచేయటం లేదని ఏజెన్సీ వారికి తెలియజేశాం. బాగుచేసేందుకు వాళ్లు రావడం లేదు.

\- ఎస్సై సీహెచ్ అవినాశ్

నిఘా లేకపోవడంతోనే..

శాంతిభద్రతలు కాపాడుతూ, ప్రజలకు, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ యంత్రాంగం తగినంత మంది లేకపోవడంతో దొంగలు వ్యవసాయ విద్యుత్ మోటార్ల వద్ద కేబుల్ వైర్లను విచ్చలవిడిగా కత్తిరించుకుపోతున్నారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఇటీవల దొంగల ముఠా లంకలకు దర్జాగా వెళ్లి ఒకేరాత్రి 200 మోటార్ల వద్ద కేబుల్ వైర్లు కత్తిరించి ఆ వైర్లను కాల్చి రాగివైరుని తీసుకుని ఎవరి కంట పడకుండా వెళ్లిపోయింది. ఇది పోలీసుల నిఘా వైఫల్యమేనని రైతులు ఆరోపిస్తున్నారు.



లంకలో దొంగలు కేబుల్ వైరు కత్తిరించిన వ్యవసాయ మోటారు(ఫైల్)

స్వేచ్ఛగా పని ముగించుకెళుతున్న దొంగలు

పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరతతో నైట్‌బీట్లు తగ్గిపోయాయి. మరోవైపు నిఘానేత్రంగా పనికొస్తాయని ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చాలాకాలంగా పనిచేయటం లేదు. కరకట్టపై ప్రతి గ్రామం వద్ద, గ్రామం లోపల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అవి మూణ్ణాళ్ల ముచ్చటగానే మారాయి. రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం ఇలా కరకట్ట వెంట ఐలూరు వరకు సీసీ కెమెరాలు పని చేయటం లేదు. దీంతో దొంగలు స్వేచ్ఛగా తమపని ముగించుకుని నిఘా నేత్రాలకు చిక్కకుండా బయటపడుతున్నారు. సీసీ కెమెరాలు పనిచేస్తే ఎలాంటి దొంగతనమైనా ఛేదించేందుకు పోలీసులకు సాధ్యమవుతుంది.



మాట్లాడుతున్న కొండాలమ్మ ఆలయ ఈవో ఎ.కొండలరావు

కొండాలమ్మ ఆలయ హుండీల ఆదాయం రూ.37.89 లక్షలు

గుడ్లవల్లేరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేమవరం కొండాలమ్మ ఆలయం, అమ్మవారి దేవస్థాన దత్తత ఆలయం రెడ్డిపాలెం ఆంజనేయస్వామి ఆలయాల హుండీలను గురువారం తెరిచి కానుకలు లెక్కించారు. 75 రోజులకు భక్తులు కొండాలమ్మకు రూ.37.89 లక్షలు సమర్పించారని ఆలయ ఈవో ఎ.కొండలరావు తెలిపారు. రెడ్డిపాలెం అభయాంజనేయస్వామికి రూ.68,965 సమర్పించారని ఆయన తెలిపారు. మచిలీపట్నం రాబర్ట్‌సన్‌పేట రంగనాయక స్వామి ఆలయ ఈవో ఎం.సత్యప్రసాద్ పర్యవేక్షణలో, వడ్లమన్నాడు ఇండియన్ బ్యాంక్ అధికారులు, ఆలయ సిబ్బంది సమక్షంలో హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించామని ఈవో కొండలరావు తెలిపారు.



సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న కాలనీవాసులు, సీపీఎం నాయకులు

శ్రీకాళహస్తి కాలనీకి తాగునీరివ్వాలి

గుడివాడ రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకాళహస్తి కాలనీ ఏర్పాటై ఇరవై ఏళ్లైనా ఇప్పటికీ కాలనీకి తాగునీరు ఇవ్వలేకపోయారని ఇది సిగ్గుచేటని, వెంటనే కాలనీకి తాగునీరు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం శ్రీకాళహస్తి కాలనీ సచివాలయం దగ్గర స్థానికులతో కలిసి సీపీఎం నాయకులు నిరసన తెలిపి, కార్యదర్శి కోటయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఎప్పటికప్పుడు ట్యాంకర్లతో అరకొరగా నీళ్ల పట్టి పబ్బం గడుపుతున్నారని ఆర్సీపీ రెడ్డి అన్నారు. పైపు లైన్లు వేసిన తర్వాత కూడా నీటి సరఫరా జరగడం లేదని, దీని కారణంగా ప్రజలు వేసవిలో తాగునీటికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, తక్షణమే తాగునీటి సౌకర్యం కల్పించాలని, లేకపోతే ఆందోళన చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాయకులు ఆర్.కొండ, ఎల్.సురేంద్ర, స్థానికులు ఎం.మంగమ్మ, బి.లక్ష్మీ, ఎం.లోకేశ్వరి, భవాని, రంగారావు, ఎ.వెంకటేశ్వరరావు, ఎస్.క్రీస్తురాజు పాల్గొన్నారు.

బొడ్డపాడులో అపరాల కొనుగోలు కేంద్రం ప్రారంభం

తోట్లవల్లూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు రైతు సేవా కేంద్రంలో ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రాన్ని గురువారం సర్పంచ్ మూడే శివశంకర్ ప్రారంభించారు. మండలంలోని 16 గ్రామాల రైతుల కోసం కొనుగోలు కేంద్రం ప్రారంభించామని సర్పంచ్ తెలిపారు. క్వింటా మినుములకు రూ.7,400, క్వింటా పెసలకు రూ.8,682 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ప్రతినిధి నాగార్జున, ఉప సర్పంచ్ కె.శివశంకర్, పాలకేంద్రం అధ్యక్షుడు వసంతకుమార్, గ్రామ వ్యవసాయశాఖ అసిస్టెంట్ యశ్వంత్‌కుమార్ పాల్గొన్నారు.



అపరాల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శివశంకర్, మార్క్‌ఫెడ్ అధికారి నాగరాజు

పావనగిరి మాత ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు

నందివాడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పోలుకొండలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే పావనగిరి మాత ఉత్సవాలకు తమ సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తామని ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. పార్కింగ్‌పై ఆర్సీఎం చర్చి ఫాదర్ అనిల్‌కుమార్‌తో మాట్లాడారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. చర్చి పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో 246 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఎస్సై తెలిపారు.



పోలుకొండలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాస్, చర్చి ఫాదర్ అనిల్‌కుమార్



పూడికతీత పనులు చేస్తున్న యంత్రం

పంట కాలువ పూడికతీత

పెదపారుపూడి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో నీటి కాలువలు, మురుగు కాలువలు తవ్విన పాపాన పోలేదని, కూటమి ప్రభుత్వం చివరి భూమికీ సాగునీరు అందించాలనే లక్ష్యంతో కాలువల పూడిక తీయిస్తుందని పెదపారుపూడి నీటి సంఘం అధ్యక్షుడు కాగిత లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం వెంట్రప్రగడ నుంచి గుడివాడ వైపు పంట కాలువ(సౌత్ చానల్)లో హక్కుల చెరువు వద్ద పూడిక తీశారు. పనులను లక్ష్మీనారాయణ పరిశీలించారు.

రెండెకరాల వరిగడ్డి దగ్ధం

పెదపారుపూడి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌పై తీసుకెళుతున్న వరి గడ్డి లోడుకు మంటలు అంటుకోగా, డ్రైవర్ గడ్డిని రోడ్డు మధ్యలో దించేసి ట్రాక్టర్‌తో సహా వెళ్లిపోయాడు. దీంతో రెండెకరాల గడ్డి దగ్ధమైంది. ఈ ఘటన పెదపారుపూడి నుంచి ముదునూరు వెళ్లే రోడ్డులో అప్పికట్ల గ్రామం వద్ద గురువారం జరిగింది. గ్రామానికి చెందిన శివకుమార్ గుడివాడ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా, సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రెండు ఎకరాల వరి గడ్డి దగ్ధమైందని, రూ.15 వేలు నష్టం వాటిల్లిందని అదనపు జిల్లా అగ్నిమాపక అధికారి జె.ఆంజనేయులు తెలిపారు.



మంటలను అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది



బేతవోలులో బడ్డీ కొట్టు..

గుడివాడ: విజయవాడ రోడ్డులోని బేతవోలు పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న ఏలియాకు చెందిన బడ్డీకొట్టు గురువారం అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గుడివాడ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది స్పందించి చుట్టుపక్కలకు మంటలు వ్యాపించకుండా అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో చెక్కబడ్డీ, గ్యాస్ రెగ్యులేటర్, ఇతర వస్తువులు దగ్ధమయ్యాయని అగ్నిమాపక అధికారి తెలిపారు.

బేతవోలులో దగ్ధమవుతున్న బడ్డీకొట్టు

ముగిసిన ఈ-శ్రమ్ శిబిరం

గుడివాడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో కార్మిక శాఖ తరఫున ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసేందుకు ఏర్పాటుచేసిన శిబిరం గురువారంతో ముగిసింది. ది కృష్ణాజిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు గురువారం 69మంది కార్మికులు పేర్లను నమోదు చేసుకున్నారని యూనియన్ అధ్యక్షుడు అబ్దుల్ అమీర్ తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

నాగాయలంక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): చెరువు పనులు చేస్తుండగా ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి చెందిన ఘటన భావదేవరపల్లిలో బుధవారం రాత్రి జరిగింది. ఆవుల అబ్రహం ట్రాక్టర్‌పై ముమ్మారెడ్డి నరసింహారావు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం చెరువులో దుక్కు దున్నటానికి వెళ్లిన నరసింహారావు రాత్రి ఏడు గంటల సమయంలో ట్రాక్టర్ అదుపు తప్పి తిరగబడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ముమ్మారెడ్డి బెనర్జి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు

మచిలీపట్నం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల వద్ద దింపుతానని నమ్మబలికి బాలికను బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆటోడ్రైవర్‌పై ఇనకుదురు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. శారదానగర్ కొత్త సచివాలయం వద్ద నివసిస్తున్న బాలిక బడికి వెళుతుండగా ఆటోడ్రైవర్ పాఠశాలలో దింపుతానని నమ్మ బలికాడు. ఆటో ఎక్కిన ఆమెను బీచ్‌కు తీసుకువెళతానని చెప్పి వేగంగా నడపడంతో మంచినీళ్ల కాలువ వద్ద బాలిక ఆటో నుంచి దూకేసింది. బాలిక బంధువు గుర్తించి ఆమెను పాఠశాలలో దించాడు. బాలిక ఇంటికి వచ్చి జరిగిన సంగతి తల్లిదండ్రులతో చెప్పింది. వారి ఫిర్యాదు మేరకు నిందితుడు కొక్కిలిగడ్డ కృపాసాగర్ అలియాస్ కిరణ్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మహా సౌరహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

వైభవంగా మహా సౌరహోమం

మచిలీపట్నం టౌన్, మార్చి20 (ఆంధ్రజ్యోతి) : బుట్టాయిపేటలోని చిట్టి పిళ్లారయ్య స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వేద పండితులు విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో సౌరహోమం నిర్వహించారు. సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామా కుమారి ఆధ్వర్యంలో సంపూర్ణ భగవద్గీత పారాయణ జరిగింది. సంపూర్ణ భగవద్గీత పారాయణ చేసి మైసూరు గణపతి సచ్చిదానంద స్వామి నుంచి బంగారు పతకాలు పొందిన మహిళలు పారాయణ కార్యక్రమంలో పాల్గొన్నారు. గరికతో భక్తిశ్రద్ధలతో గణపతి పూజలు జరిపారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి



మృతి చెందిన దేవీచంద్రరావు

ఘంటసాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది ఘంటసాలలోని రజకపేటకు చెందిన టీడీపీ కార్యకర్త కొడాలి దేవీచంద్రరావు (29) గొర్రెల కాపరిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మల్లాయిచిట్టూరు రోడ్డులో గొర్రెలను మేపుకోవటానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో గృహనిర్మాణ సంస్థకు చెందిన గోడౌన్ సమీపంలో బైక్ ఢీకొంది. చంద్రరావు తల వెనుకభాగంలో తీవ్ర గాయమైంది. స్థానికులు 108కు సమాచారం అందించారు. దేవి చంద్రరావును చల్లపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించి, వైద్యుని సూచనల మేరకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం విజయవాడ తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. చంద్రరావుకు భార్య భవాని, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య భవాని ఫిర్యాదు మేరకు ఘంటసాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కొడాలి దేవిచంద్రరావు ప్రమాదవశాత్తు మృతి చెందటంతో స్థానిక టీడీపీ నాయకులు కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి మాధవేంద్రరావు

కలెక్టర్ ఆదేశాలు ప్రతి ఒక్కరూ పాటించాలి

చల్లపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాలు ప్రతి ఒక్కరూ పాటించాలని చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇస్లాం నగర్ పరిసర ప్రాంతాల్లోని చెత్త సేకరణ ప్రక్రియను సర్పంచ్, ఈవోలు పరిశీలించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఉంచాలని, ప్రతి ఇంట్లో రెండు డస్ట్‌బిన్స్ కచ్చితంగా నిర్వహించుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్త విభజనపై నివాసితులకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన ఇంటి పన్ను, కుళాయి బకాయిలను తక్షణమే చెల్లించాలని సర్పంచ్ ప్రజలను కోరారు. నెలాఖరులోపు నూరుశాతం పన్ను వసూళ్ల లక్ష్యంగా పనిచేస్తున్న నేపథ్యంలో పన్ను వసూళ్లకు సహకరించాలన్నారు. మొండి బకాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకోకముందే బకాయిలు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్ సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సబ్సిడీపై రుణాలు

● మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నాగరమేష్

మచిలీపట్నం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి మత్స్య సంయుక్త యోజన పథకం కింద జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సబ్సిడీపై రుణాలు ఇస్తున్నట్టు జిల్లా మత్స్యకారుల సహకార సంఘ అధ్యక్షుడు కొక్కిలిగడ్డ నాగరమేష్ తెలిపారు. పెనమలూరులోని మత్స్యకార కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశం అనంతరం మచిలీపట్నంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు 60 శాతం, బీసీ పురుషులు, జనరల్‌కు 40 శాతం సబ్సిడీతో వలలు, ఇంజన్లు, ఫైబర్ బోట్లు, ఐస్‌ప్లాంట్లు, హేచరీలు, త్రీవీలర్ ఆటో, ఫోర్ వీలర్ వెహికల్స్‌కు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. గూడూరు మండలంలో ఆరున్నర కోట్లతో ఫీడ్ మిల్లును ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు.

నాగాయలంక గ్రంథాలయంలో సౌకర్యాల లేమి

● కార్యదర్శి రవికుమార్‌కు పాఠకులు ఏకరువు



గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కార్యదర్శి రవికుమార్

నాగాయలంక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నాగాయలంకలోని శాఖా గ్రంథాలయంలో మౌలిక వసతులు కల్పిస్తామని, పాఠకులకు విజ్ఞానం పుస్తకాలను అందిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ వెల్లడించారు. స్థానిక గ్రంథాలయాన్ని గురవారం తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. పాఠకులు పలు సమస్యలు ఏకరువు పెట్టారు. గ్రంథాయలంలో ఫ్యాన్లు తిరగటం లేదని, కుర్చీలు లేవని, కంప్యూటర్ సౌకర్యం లేదని, లైబ్రరీ ముఖద్వారంలో ఓఎన్‌జీసీ యాజమాన్యం నిర్మించిన మరుగుదొడ్లను సక్రమంగా నిర్వహించడం లేదని, మల, మూత్ర వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోందని వాపోయారు. గ్రంథాయానికి రాను రాను పాఠకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త పుస్తకాలు రావడం లేదని వివరించారు. నిధుల కొరతతో మౌలిక సదుపాయాలు సమకూర్చ లేకపోతున్నామని ఆయన తెలిపారు. ఓఎన్‌జీసీ యాజమాన్యంతో మాట్లాడి మరుగుదొడ్ల సమస్యలను పరిష్క రిస్తామని హామీ ఇచ్చారు. కొత్త ప్రభుత్వం గ్రంథాలయాలపై దృష్టిసారించిందని, త్వరలోనే అన్ని గ్రంథాలయాలకు మౌలిక వసతులు సమకూర్చుతామని కార్యదర్శి తెలిపారు. గ్రంథాలయాధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

నాగాయలంక ఆక్వా ల్యాబ్‌ను పునఃప్రారంభించాలి

● సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం

నాగాయలంక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా రైతుల ప్రయోజనాలు పరిరక్షించటంలో మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంపెడా) విఫలమైందని టీడీపీ జిల్లా నేత, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు విమర్శించారు. నాగాయలంకలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆక్వా రైతుల ప్రయోజనాల కోసం ఎంపెడా అనుబంధ సంస్థ నాక్సా ఆధ్వర్యంలో నాగాయలంకలో నాలుగు సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఆక్వా ల్యాబ్‌ను కూడా అర్థంతరంగా తీసివేయటంతో ఆక్వా రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తక్షణం ఆక్వా ల్యాబ్‌ను పునఃప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో విజయవాడలోని ఎంపెడా రీజినల్ డివిజన్ కార్యాలయం వద్ద ఆక్వా రైతులతో కలసి ఆందోళన చేపడతామని నాగాంజనేయులు హెచ్చరించారు.



డ్రగ్స్ దుష్పరిణామాలపై సీఐఎస్‌ఎఫ్ చేపట్టిన సైకిల్ ర్యాలీ, పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఏఎస్పీ



ఉల్లిపాలెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మెరైన్ పోలీసులు

డ్రగ్స్ నుంచి యువతను రక్షించడమే లక్ష్యం

● డిప్యూటీ కమాండెంట్ హ్రిషబ్
● తీరప్రాంతంలో సీఐఎస్‌ఎఫ్ ర్యాలీ

మచిలీపట్నం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను పాడుచేసుకుంటున్న యువతను చైతన్య పరిచేందుకు దేశ వ్యాప్త సైకిల్ ర్యాలీ చేపట్టినట్లు సీఐఎస్‌ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ హ్రిషబ్ తెలిపారు. డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన పెంపొందించేందుక కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్‌ఎఫ్) చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం మచిలీపట్నం చేరుకుంది. సురక్షిత తీరం - సమృద్ధ భారతం పేరుతో 120 మంది సీఐఎస్‌ఎఫ్ జవాన్లు రెండు బృందాలు దక్షిణ, ఉత్తర భారతదేశాలను కలుపుతూ సైకిల్ యాత్ర చేపట్టారు. మార్చి 7వ తేదీన బెంగాల్ రాష్ట్రంలోని తీర ప్రాంతం నుంచి ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర కన్యాకుమారితో ముగుస్తుంది. ఈ యాత్రలో డిప్యూటీ కమాండర్ హ్రిషబ్ ప్రభాకర్, అసిస్టెంట్ కమాండెంట్‌లు జి.శ్రీనివాస్, సికర్ లోహియా తదితరులు ఉన్నారు. ఈ సైకిల్ యాత్రలో పాల్గొన్న వారిపై మచిలీపట్నం పోలీసులు పూలవర్షం కురిపించారు. జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలు వద్ద ఏ ఎస్పీ సత్యనారాయణ స్వాగతం పలికారు.

ఆలివ్‌రిడ్లే తాబేళ్ల పరిరక్షణ



ఏటిమొగలో అవగాహన కల్పిస్తున్న మెరైన్ పోలీసులు

కోడూరు : ఆలివ్ రిడ్లే తాబేళ్ల పరిరక్షణ మనందరి బాధ్యత అని పాలకాయితిప్ప మెరైన్ ఎస్సై పూర్ణ మాధురి తెలిపారు. మండల పరిధిలోని ఉల్లిపాలెం, హంసలదీవి, పాలకాయితిప్ప గ్రామాల్లో మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆలివ్ రిడ్లే తాబేళ్లు సముద్రంలోని వ్యర్థాలను, పిచ్చిమొక్కలను తింటూ సముద్రపు నీరు కలుషితం కాకుండా ఉండేందుకు దోహదపడతాయని తెలిపారు. సముద్రంలో కలుపు మొక్కలను తొలగించటం వల్ల సాగర గర్భంలో ఇతర జీవరాశులు స్వేచ్ఛగా పెరగటానికి అవకాశం ఏర్పడుతుందని, తద్వారా మత్స్య సంపద అభివృద్ధి చెందుతుందన్నారు. హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. **నాగాయలంక** : ఏటిమొగ, గుల్లలమోద, ఎదురుమొండి, దీనదయాళ్‌పురం గ్రామాల్లో గురువారం మత్స్యకారులకు ఆలివ్ రిడ్లే తాబేళ్ల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్స్యకారులు, గ్రామస్థులు, పెద్దలు పాల్గొనగా, పాలకాయితిప్ప మెరైన్ పోలీసులు రెహమాన్ ఆలీ, నరసయ్య, సిబ్బంది అవగాహన కల్పించారు.

ఘంటసాలలో అధికారుల క్షేత్రస్థాయి పర్యటన

● కలెక్టర్ ఆదేశంతో సమస్యల పరిష్కారం



వేములపల్లిలో మురుగునీటి సమస్య, ఆక్రమణల విషయమై ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

ఘంటసాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ డీకే.బాలాజీ ఆదేశాలతో ఎంపీడీవో డి.సుబ్బారావు, తహసీల్దార్ విజయ ప్రసాద్, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. వేములపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో మురుగునీటి పారుదల, రోడ్ల ఆక్రమణల సమస్యలను స్థానిక ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆ గ్రామంలో పర్యటించి, సర్వే చేసి సమస్యను పరిష్కరించాల్సిందిగా మండల సర్వేయర్‌ను ఆదేశించారు. శ్రీకాకుళం గ్రామానికి చెందిన బాణావత్ వెంకటరమణ తన పొలంలోకి వెళ్లే రహదారి ఆక్రమణకు గురైందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు పిటిషనర్‌తో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. సమస్యను పరిష్కరించాల్సిందిగా వీఆర్వో, సర్వేయర్‌ను ఆదేశించారు. తెలుగురావుపాలెం గ్రామంలో చెరువు ఆక్రమణలకు గురైందని వచ్చిన ఫిర్యాదుపై స్పందించిన అధికారులు చెరువుకు సంబంధించిన హద్దులు మార్కింగ్ చేయాల్సిందిగా సర్వేయర్‌కు సూచించారు. చినకళ్లేపల్లి ఎస్సీ కాలనీలో మురుగు నీరు పారుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ పర్యటనలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

పెడన రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : లంకలకలవగుంట ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మువ్వల కిరణ్‌బాబును విధుల నుంచి తొలగిస్తూ జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఉత్తర్వులు జారీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మద్దాల రత్నకుమారి పనికి హాజరై 76 రోజుల వేతనం రూ.10,355, దివ్యాంగురాలు మువ్వల ధనలక్ష్మి 100 రోజులు పనికి హాజరై రూ.13,530, గ్రామంలో నివాసం లేని మువ్వల రమేష్‌బాబు 86 రోజులు పనికి హాజరై రూ.11,306 తీసుకున్నట్లు వారివారి ఖాతాల్లో నగదు జమచేసి పంచుకున్నారని, జాబ్ కార్డ్ కోసం కూలీల దగ్గర రూ.500 చొప్పున వసూలు చేశాడని, రికార్డులు సక్రమంగా లేవని జిల్లా అంబుడ్స్‌పర్సన్ కె.వి.శ్రీనివాసరావు విచారణలో తేలింది. దీంతో కిరణ్‌బాబును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వుల నకళ్లను గ్రామ సర్పంచ్‌కు, ఎంపీడీవో కార్యాలయానికి పంపించారు.

కాగిత వెంకట్రావుకు టీడీపీ శ్రేణుల నివాళి

పెడన, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కాగిత వెంకట్రావు తాను చేపట్టిన పదవులకు వన్నె తెచ్చారని బీసీ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తోటమూల ఫంక్షన్ హాలులో మాజీ శాసనసభ్యుడు, మాజీ చీఫ్ విప్, టీటీడీ మాజీ చైర్మన్ కాగిత వెంకట్రావు జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షే మ సంఘం నాయకులు బొర్రా కాశీవిశ్వేశ్వరరావు, పరసా శివనాగరాజు, కాగిత రవిబాబు, వీరంకి శ్రీనివాసరావు, గూడవల్లి కృష్ణార్జునరావు, మురాల ఫణికుమార్, కాలెపు సూరిబాబు, పామర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో కాగిత వెంకట్రావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తన తండ్రి వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, బొల్లా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గూడూరు : మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు 73వ జయంతిని గూడూరు ప్రధాన సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పోతన స్వామి, కట్టా మునీశ్వరరావు, ఎస్ఏ బేగ్, సిరివెళ్ళ శ్రీను, జి. ఫణిరాజు, బొర్రా శ్రీను, కె. నాగమురళి, బి. స్వామి, బి. శ్రీను, యారా ప్రసాద్, లుక్కా ఏలేషు, బాబూరావు, సుధాకర్, పవన్, నాగరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు భౌతికకాయానికి నివాళి


లేళ్లగరువు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రాయపురెడ్డి శ్రీనివాసరావు మృతదేహాన్ని గురువారం మచిలీపట్నం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీనివాస్ మృతదేహాన్ని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, గరికపాటి శివ, దాసరి ఉమాసాయిరామ్, ధనేష్, వేమూరి స్వామి తదితరు సందర్శించి నివాళులర్పించారు.



ముమ్మరంగా సిల్టు తొలగింపు

మచిలీపట్నం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగరంలో ఆక్రమణలను తొలగించడంతో డ్రెయిన్లలో సిల్టు తీసే పనులు ముమ్మరం చేశారు. డ్రెయిన్లలో ఎక్కడి మురుగు అక్కడే ఉండి దుర్గంధం వస్తోంది. ఆక్రమణలను తొలగించడంతో డ్రెయిన్లలో పూడికతీసేందుకు మార్గం సుగమమైంది. ఈడేపల్లి శక్తిగుడి సెంటర్, మునిసిపల్ ఆఫీసు పక్క బజారుల్లోని డ్రెయిన్లలో యంత్రాలతో పూడిక తీయక తప్పని పరిస్థితి నెలకొంది. వేసవిలో సిల్టు తీయడం పూర్తి చేస్తే వర్షాకాలంలో డ్రెయిన్లు పొంగకుండా ఉంటాయి.

కేడీసీసీబీ విశ్రాంత మేనేజర్ నాంచారయ్య మృతి



నాగాయలంక, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక కేడీసీసీ బ్యాంకు బ్రాంచి విశ్రాంత మేనేజర్ మత్తి నాంచారయ్య (75) మృతి చెందారు.కొంతకాలంగా అస్వస్థులుగా ఉన్న నాంచారయ్య టి.కొత్తపాలెంలోని స్వగృహంలో గురువారం తుది శ్వాస విడిచారు. ఆయన భార్య మరణించగా, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం నాగాయలంక జడ్పీ పాఠశాల అభివృద్ధి కమిటీలో ఉంటూ పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశారు. సామాజిక కార్యక్రమాలలో పాల్గొని యువతను ప్రోత్సహించేవారు. ఆయన మృతి పట్ల గ్రామ, మండల ప్రముఖులు తీవ్ర సంతాపాన్ని తెలిపారు.

భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు

అవనిగడ్డ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గత 20 రోజులుగా రామచంద్రపురం ఎంపీయూపీ పాఠశాలలో భగవద్గీత కంఠస్థం పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి రూ.1000 లు, రెండవ బహుమతి రూ.500, మూడవ బహుమతి రూ.300 అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్తి శ్రీనివాసరావు, మత్తి శేషగిరిరావు (గురూజీ), ప్రధానోపాధ్యాయులు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

మామిడిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు

అవనిగ్డ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మామిడిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా అధిక దిగుబడులు సాధించ వచ్చని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి పేర్కొన్నారు. వేకనూరు, బందలాయిచెరువు, ఎడ్లంక గ్రామాలలోని మామిడి తోటలను పరిశీలించి రైతులకు సమగ్ర యాజమాన్యంపై అవగాహన కల్పించారు. లింగాకర్షిక బుట్టలను రైతులకు అందజేశారు. పిందె సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు అందించారు. శాస్త్రవేత్తలు, విఏఏ పవన్, రైతులు పాల్గొన్నారు.

మన కోసం మనం ట్రస్ట్‌కు ఎన్నారై రూ.లక్ష విరాళం

చల్లపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మన కోసం మనం ట్రస్ట్‌కు ప్రవాస భారతీయులు దాసరి అనుదీప్ లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్ సోదరు డు చిన్నాజీ కుమారుడైన అనుదీప్ తన పుట్టిన రోజు సందర్భంగా విరాళాన్ని కాలిఫోర్నియా నుంచి పంపారు. విరాళం అందించిన అనుదీప్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసులకు సమాచారమివ్వండి

కోడూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలను నియంత్రించటమే ప్రధాన లక్ష్యమని, అపరిచిత వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసు వారికి తెలియపర్చాలని ఎస్సై కె.చాణిక్య తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మా ట్లాడారు. మండల ప్రజలు తీర్థ యాత్రలకు, శుభకార్యాలకు , ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసు లకు సమాచారం అందివ్వాలని సూచించారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

నాగాయలంక, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి): చెరువు పనులు చేస్తుండగా ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన భావదేవరపల్లిలో బుధవారం రాత్రి జరిగింది. అవుల అబ్రహం ట్రాక్టర్‌పై ముమ్మారెడ్డి నరసింహారావు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 19వ తేదీ ఉదయం చెరువులో దుక్కు దున్నటానికి వెళ్లిన నరసింహారావు బుధవారం రాత్రి ఏడు గంటల సమ యంలో ట్రాక్టర్ అదుపు తప్పి తిరగబడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ముమ్మారెడ్డి బెనర్జీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ ఆత్మహత్యా యత్నం

చల్లపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : సహోద్యోగి తనను అల్లరిపాలు చేస్తున్నాడనే మనస్తాపంతో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ వరిగంజి నాగార్జున గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యాయత్నానికి దారితీసిన పరిస్థితులను తెలియచేస్తూ పురుగుమందు తాగి వీడియోను స్నేహితులకు పంపాడు. హుటాహుటిన వారు చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా తాగిన మందు కక్కించి మెరుగైన వైద్యచికిత్సల కోసం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. ఒక మహిళతో అక్రమసంబంధం అంటగట్టి సహోద్యోగి రమేష్ తనను అల్లరి చేస్తున్నాడని సెల్ఫీ వీడియోలో తెలిపాడు. కుటుంబ సభ్యులు ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.